



Truth of News

# సూర్య వాస్తవం

PRGI Reg No: APTEL/26/A4781

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్






అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 49 | ఆదివారం 27 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


# నిర్ణయాలన్నీ ఏకగ్రీవమే

- స్పష్టం చేసిన ముగ్గురు కమిషనర్లు
- ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం..
- ప్రెస్ నోట్, గ్రూప్ ఫొటోతో చెక్ పెట్టిన ఈసీ
- ఈసీలో విభేదాల వార్తలను ఖండించిన పూర్తిస్థాయి కమిషన్
- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించిందని వెల్లడి
- పనితీరును మెరుగుపర్చేందుకు అంతర్గత విధానాల్లో కీలక మార్పులు
- ఈసీఐనెట్ పోర్టల్‌పై సమీక్షకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు

2లో



# కాంగ్రెస్ నెక్స్ట్ ప్లాన్ ఇదేనా?

న్యూఢిల్లీ- సూర్య వాస్తవం

కాంగ్రెస్‌లో కీలక రాజకీయ కదలికలకు రంగం సిద్ధమవుతోంది. ఈనెల 29న న్యూఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరగనుంది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగే ఈ భేటీలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు సంబంధించిన అంశం ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. ప్రత్యేకంగా ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన సర్‌పై కాంగ్రెస్ ఇప్పటికే తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో జ్ఞానేశ్ కుమార్‌పై

- మిగతా 2లో..





# 10 శాతం వృద్ధి సాధ్యమే

- టెక్నాలజీపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పెట్టుబడులతోనే దేశానికి ఉజ్వల భవిష్యత్తు
- ఏఐ, సెమీకండక్టర్లకు భారీగా నిధులు కేటాయించాలని సూచన
- చిన్న పరిశ్రమల్లోనూ ఏఐ వాడకం పెరగాలని వ్యాఖ్య

న్యూఢిల్లీ- సూర్య వాస్తవం

దేశ ఆర్థిక వృద్ధి రేటు 10 శాతం మార్కును అధిగమించాలంటే అన్ని రంగాల్లోనూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఉందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్

- మిగతా 2లో..

# రసవత్తరం రాయలసీమ వైసీపీ రాజకీయం..!




- వైసీపీలో అంతర్మథనం...!
- రాజీనామాలతో మొదలైన అసంతృప్తి.. ఇంకా ఎవరెవరు?
- ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు కరువా?
- టికెట్ల మార్పులు.. వైసీపీలో ముదురుతున్న అంతర్మథనం
- ఒక్కొక్కరుగా దూరమవుతున్న సీనియర్లు.. కారణమేంటి?
- పార్టీని నమ్ముకున్న వారికే నిరాశ మిగిలిందా?
- స్థానిక సంస్థల ఎన్నికల వేళ మళ్లీ అదే ప్రశ్న
- కేడర్ మనసు గెలిచే అభ్యర్థులకే ప్రాధాన్యత ఇవ్వాలంటున్న కార్యకర్తలు
- సీనియర్లను సమన్వయం చేస్తారా.. కొత్త ముఖాలకే మొగ్గుచూపుతారా?

## - పాతవారికి మొండి చేయి.. కొత్తవారికి పెద్దపీట ?

అనంతపురం ప్రత్యేక ప్రతినిధి - సూర్య వాస్తవం:

రసవత్తరంగా మారిన రాయలసీమ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజకీయం ఉమ్మడి అనంతపురం జిల్లాలోని హిందూపురం పార్లమెంట్ అసెంబ్లీ స్థానాలలో అన్నమయ్య జిల్లాకు సంబంధించిన మాజీ మంత్రి మరియు ఎంపీ ప్రమేయంతో వలస నాయకులను ప్రోత్సహించడం వలన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి జగన్మోహన్ రెడ్డి తో పాటు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి ఎటువంటి పదవులు ఆశించకుండా కష్టపడి పనిచేసిన నాయకులకు మొండి చేయి చూపించి సదరు మాజీ మంత్రి ఎంపీ వ్యక్తిగత పరిచయాలు వ్యాపార లావాదేవీల వలన సంబంధాలు ఉన్న వ్యక్తులను ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో వారిని పోటీకి నిలపడం వలన సీనియర్ నాయకులకు తీవ్రమనస్థాపం కలిగించిందని కొంతమంది నాయకులు కార్యకర్తలు అనుకుంటున్నారు రాజశేఖర్ రెడ్డి జగన్మోహన్ రెడ్డి మీద ఉన్న అభిమానంతో పార్టీని వదిలి వెళ్లలేక కొంతమంది అలాగే కొనసాగుతున్నారు మరి కొంతమంది నాయకులు పార్టీలోనే ఉంటూ పని చేయకుండా ఉండిపోయారు భవిష్యత్తు కార్యాచరణలో భాగంగా కొంతమంది నాయకులు పార్టీకి రాజీనామా చేసే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం గతంలో వైఎస్ఆర్ కుటుంబానికి పార్టీకి వెన్నుదన్నుగా ఉన్న రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డిని విస్మరించి బెంగళూరులో

- మిగతా 2లో..



# 11 రాష్ట్రాలో హై అలర్ట్!

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

దేశంలోని పలు ప్రాంతాల్లో వాతావరణం మరోసారి మారుతోంది. పలు రాష్ట్రాల్లో వర్షాలు మరోసారి తీవ్రరూపం దాల్చనున్నాయి దక్షిణ ఛత్తీస్‌గఢ్, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ ఒడిశా అంతర్భాగంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో

- మిగతా 2లో..



# మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి



- కేంద్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ విజ్ఞప్తి.
- ఘనంగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ విగ్రహావిష్కరణ
- తెలంగాణ ఆవిర్భావంలో ఆయన సేవలను గుర్తుచేసిన ముఖ్యమంత్రి

హైదరాబాద్ - సూర్య వాస్తవం

మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా హైదరాబాద్ గచ్చిబౌలి ఐటీ కారిడార్‌లోని విప్రో సర్కిల్‌లో ఏర్పాటు చేసిన ఆయన కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు

- మిగతా 2లో..

# ఈసీ ప్రకటనతో అపోహలకు తెరపడింది

- సీఎం చంద్రబాబు
- ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం
- ఢిల్లీలో కీలక సమావేశంతో క్లారిటీ ఇచ్చిన ఈసీ
- తమ మధ్య విభేదాలు లేవంటూ సంయుక్త ప్రకటన విడుదల
- సోషల్ మీడియాలో స్పందించిన ఏపీ సీఎం చంద్రబాబు
- రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను గౌరవించాలని పిలుపు
- గెలుపోటములను హుందాగా స్వీకరించడమే నాయకత్వ లక్షణమని ఉద్ఘాటన

అమరావతి- సూర్య వాస్తవం



భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య విభేదాలు తలెత్తాయంటూ వచ్చిన వార్తలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ఇవాళ ఓ కీలక సమావేశం సందర్భంగా ఈసీ ఇచ్చిన ఏకగ్రీవ ప్రకటనతో అన్ని అపోహలకు తెరపడిందని ఆయన పేర్కొన్నరు. మన రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను ఈ ప్రకటన మరోసారి స్పష్టం చేసిందని ఎక్స్ వేదికగా శనివారం ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై నెలకొన్న వివాదం తాజాగా ఈసీ వివరణతో ముగిసిందని తెలిపారు. స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాల కోసం భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేయడం దురదృష్టకరమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఎన్నికల ఫలితాలు

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# కాంగ్రెస్ నెక్స్ట్ ప్లాన్ ఇదేనా?

(మొదటి పేజీ తరువాయి)

తదుపరి కార్యాచరణ ఏంటి? పార్లమెంట్‌లో ఆయన తొలగింపును కోరుతూ మరోసారి తీర్మానం దిశగా వెళ్లాలా? అనే అంశాలపై జఔజలో పార్టీ నేతలు చర్చించే అవకాశం ఉంది. ప్రతిపక్షాలు ఇప్పటికే రెండు సభల్లో రిమూవల్ మోషన్ కోసం తాజా నోటీసు దిశగా కసరత్తు చేస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ సమావేశానికి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ముఖ్య నేతలు హాజరయ్యే అవకాశం ఉంది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి , కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు వంటి నేతల పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకోనుంది. అదే సమయంలో ఇండియా కూటమి పార్టీలతో సమన్వయంపైనా జఔజలో చర్చ జరిగే అవకాశం ఉంది. జ్ఞానేశ్ కుమార్ అంశంపై ప్రతిపక్ష పార్టీలను ఒకే వేదికపైకి తీసుకురావడం, పార్లమెంట్‌లో తదుపరి వ్యూహాన్ని రూపొందించడం వంటి అంశాలు కూడా భేటీలో ప్రస్తావనకు రావచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

అయితే సీఈసీని తొలగించే ప్రక్రియ సాధారణ రాజకీయ తీర్మానంతో పూర్తయ్యేది కాదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(5) ప్రకారం, సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించే విధానానికి సమానమైన పార్లమెంటరీ ప్రక్రియ అవసరం. రెండు సభల్లోనూ రాజ్యాంగపరమైన ప్రత్యేక మెజారిటీతో తీర్మానం ఆమోదం పొందాల్సి ఉంటుంది. ఇప్పటికే 2026 మార్చిలో జ్ఞానేశ్ కుమార్ తొలగింపునకు సంబంధించిన నోటీసును లోక్‌సభ స్పీకర్ అంగీకరించలేదు. ఇప్పుడు మరోసారి ఈ అంశం రాజకీయంగా తెరపైకి రావడంతో సెప్టెంబర్ 29 జఔజ సమావేశంపై ఆసక్తి నెలకొంది. సెప్టెంబర్ 29 భేటీలో కాంగ్రెస్ ఎలాంటి వ్యూహాన్ని ఖరారు చేస్తుంది? ×చీణ×ూ కూటమి పార్టీలతో కలిసి పార్లమెంట్‌లో తదుపరి అడుగు ఎలా ఉండబోతోంది? అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# 10 శాతం వృద్ధి సాధ్యమే

(మొదటి పేజీ తరువాయి)

ఇంటెలిజెన్స్ (ఏఐ), సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ వంటి భవిష్యత్ సాంకేతిక విభాగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టడం ద్వారానే దేశం అభివృద్ధి పథంలో దూసుకెళుతుందని ఆమె స్పష్టం చేశారు. బెంగళూరులో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆమె ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. సాంకేతికత ఆధారంగా వివిధ రంగాల్లో మరిన్ని అంకుర సంస్థలు ఆవిర్భవించాలని ఆమె పిలుపునిచ్చారు.

నూతన సాంకేతికతలను ప్రజలు సులభంగా అందిపుచ్చుకునేలా నైపుణ్యాభివృద్ధి, శిక్షణా కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేవలం దిగ్గజ సంస్థలకే పరిమితం కాకుండా, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో (ఎంఎస్ఎంఈ) సైతం ఏఐ వినియోగం గణనీయంగా పెరగాలని ఆమె ఆకాంక్షించారు. దేశ మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థికాభివృద్ధిలో తదుపరి దశకు చేరుకోవాలంటే అన్ని విభాగాల్లోనూ డిజిటల్ వ్యవస్థలకు పెద్దపీట వేయాలని నిర్మలా సీతారామన్ వివరించారు. ఈ ఆధునిక సాంకేతిక రంగాలకు తగిన ప్రోత్సాహం అందిస్తే, దేశ భవిష్యత్తును మరింత ఉజ్వలంగా తీర్చిదిద్దవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు.

# 11 రాష్ట్రాలో హై అలర్ట్!

(మొదటి పేజీ తరువాయి)

దేశంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. సెప్టెంబర్ 26న ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ సహా 11 రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉండగా.. కొన్ని ప్రాంతాల్లో గంటకు 50--80 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కూడా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించింది.

వాతావరణ శాఖ ప్రకారం, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లోని లోతట్టు ప్రాంతాలు, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ ఒడిశాలో అల్పపీడనం నెలకొని, ఉత్తర-వాయువ్య దిశగా కదులుతోంది. ఇది రాబోయే 12 గంటల పాటు తన అల్పపీడన తీవ్రతను కొనసాగించే అవకాశం ఉంది, ఆ తర్వాత బలహీనపడి అల్పపీడన ప్రాంతంగా మారుతుందని అంచనా. ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బీహార్, జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, సిక్కిం, హర్యానా, ఢిల్లీలలో(ణవశ్రీష్ట్రఱ ఞఱఱఅ) తేలికపాటి నుండి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండి అంచనా వేసింది. ఇదిలా ఉండగా, భారీ వర్షాలు, బలమైన గాలుల కారణంగా లోతట్టు ప్రాంతాలలో వరదలు సంభవించే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. కొండ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని హెచ్చరికలు ఉన్నాయి.

# ఈసీ ప్రకటనతో అపోహాలకు తెరపడింది

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల తీర్పును ప్రతిబింబిస్తాయని, బలమైన ప్రజాస్వామ్యంలో గెలుపును, ఓటమిని సమానంగా, హుందాగా స్వీకరించడమే నిజమైన నాయకత్వ లక్షణమని హితవు పలికారు. రాజ్యాంగ సంస్థలను గౌరవించడం అత్యంత ముఖ్యమని, భారత ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం పార్టీలకు అతీతంగా నాయకులందరి ఉమ్మడి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు.

### సంయుక్త ప్రకటనతో వివాదానికి ముగింపు

కాగా, గత కొద్ది రోజులుగా తమ మధ్య తీవ్ర విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న ఊహాగానాలకు భారత ఎన్నికల సంఘం పూర్తిస్థాయి కమిషన్ శనివారం తెరదించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి ఉన్న ఫోటోతో పాటు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా సవరణ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

### వివాదానికి నేపథ్యం ఇదే..

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన పలు నిర్ణయాలపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ సెప్టెంబర్ 23న ఓ ప్రముఖ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ, మరింత పారదర్శకత అవసరమని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి కమిషన్ సంయుక్తంగా స్పందించి, తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేసింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కోసం 2025 జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన ప్రకటనలో పేర్కొంది. ఆ తర్వాత కార్యక్రమ షెడ్యూళ్లను కూడా ఏకాభిప్రాయంతోనే విడుదల చేశామని తెలిపింది. ఈ ఆదేశాలను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని గుర్తుచేసింది. నిర్ణయాలన్నీ సమష్టిగా, సంస్థాగత విధివిధానాలను అనుసరించే తీసుకుంటామని కమిషన్ స్పష్టం చేసింది.

# నిర్ణయాలన్నీ ఏకగ్రీవమే

న్యూఢిల్లీ- సూర్య వాస్తవం

భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య తీవ్ర విభేదాలు తలెత్తాయంటూ గత కొద్ది రోజులుగా వస్తున్న వార్తలను కమిషన్ తీవ్రంగా ఖండించింది. ఈ ఆరోపణలకు తెరదించుతూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి శనివారం న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి ఉన్న గ్రూప్ ఫోటోతో పాటు ఒక సుదీర్ఘమైన ప్రెస్ నోట్‌ను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఓటర్ల నమోదు ప్రక్రియ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలపై ఇందులో సమగ్రంగా వివరణ ఇచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన పలు నిర్ణయాలపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారని సెప్టెంబర్ 23న ఓ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే.

ఈ కథనం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ, మరింత పారదర్శకత అవసరమని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి కమిషన్ సంయుక్తంగా స్పందించింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కోసం 2025 జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. ఆ తర్వాత ఈ కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూళ్లను కూడా ఏకాభిప్రాయంతోనే విడుదల చేశామని తెలిపింది. ఈ ప్రత్యేక సవరణ ఆదేశాలను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని గుర్తుచేసింది.

కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం-6లో, దరఖాస్తుదారులు తమ తల్లిదండ్రుల పేర్ల ద్వారా గత సవరణతో తమ సంబంధాన్ని ధ్రువీకరించాలనే నిబంధనపై వస్తున్న విమర్శలపైనా కమిషన్ స్పందించింది. ఈ డిక్లరేషన్‌ను కూడా సుప్రీంకోర్టు సమర్థించిందని తెలిపింది. అయితే, ఈ నిబంధన కేవలం ప్రత్యేక సవరణ ప్రక్రియకు మాత్రమే వర్తిస్తుందని, మిగతా సమయాల్లో ఎలక్టర్ల నమోదు నిబంధనలు, 1960 ప్రకారం నిర్దేశించిన ఫారాలనే వాడతామని స్పష్టం చేసింది. గోవాలో 97 మంది ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోవడంపై కూడా ఈసీ వివరణ ఇచ్చింది. ఇంటింటి సర్వే నిర్వహించి, అవసరమైన ఫారాలను సేకరించాలని గోవా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈఓ) సంబంధిత బూత్ లెవల్ అధికారులను ఆదేశించారని పేర్కొంది. ఇప్పటికే ఆ 97 మందిలో 81 మంది తమ పేర్లను చేర్చాలని కోరుతూ ఫారం-6 సమర్పించారని వెల్లడించింది.

ఇక, ఎలక్టోరల్ రోల్ డేటాబేస్‌కు యాక్సెస్ విషయంలో ఈసీఐనెట్ (జుజ×చీజు) పోర్టల్‌పై తలెత్తిన ఆందోళనలపైనా కమిషన్ స్పందించింది. క్షేత్రస్థాయి అధికారులకు వారి చట్టబద్ధమైన అధికారాలకు అనుగుణంగానే 'రోల్-బేస్డ్ యాక్సెస్' ఇస్తామని స్పష్టం చేసింది. ఈ పోర్టల్ పనితీరును సమీక్షించేందుకు ఓ సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు, ఇందులో ఐఐటీ లేదా ట్రిపుల్ ఐటీకి చెందిన స్వతంత్ర నిపుణుడు కూడా ఉంటారని ప్రకటించింది. క్యాబినెట్ సెక్రటరీకి పంపిన లేఖ ఈసీ విధానపరమైన అంశాలకు సంబంధించింది కాదని, డిప్యుటేషన్‌పై ఉన్న ఓ అధికారి పని పునఃపంపిణీకి మాత్రమే సంబంధించిందని కమిషన్ స్పష్టం చేసింది. అంతర్గత పనివిధానాలను మరింత బలోపేతం చేసేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు ఈసీ ప్రకటించింది.

ఇకపై కమిషన్ సమావేశాల అజెండాలను సభ్యులకు ముందుగానే సర్క్యులేట్ చేయాలని, సమావేశం అనంతరం మినిట్స్ జారీ చేయాలని నిర్ణయించింది. కమిషనర్లు అధికారులకు జారీ చేసే ఆదేశాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేసింది. ఢిల్లీ, మహారాష్ట్రల్లో ప్రత్యేక సవరణ గడువును పొడిగిస్తున్నట్లు తెలిపింది. తమ ప్రధాన నిర్ణయాలన్నీ సమష్టిగా, ఏకగ్రీవంగానే తీసుకున్నామని కమిషన్ పునరుద్ఘాటించింది.

# రసవత్తరం రాయలసీమ వైసీపీ రాజకీయం

(మొదటి పేజీ తరువాయి)



స్థిరపడిన మెట్టు గోవింద్ రెడ్డికి టికెట్ ఇవ్వడం రామచంద్రారెడ్డి తీవ్రమనస్థాపం చెంది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడం జరిగింది. కాపు రామచంద్రారెడ్డి పార్టీ ఆవిర్భావం ముందు నుంచి జగన్మోహన్ రెడ్డితో ఎంతో సన్నిహితంగా ఉన్నారు. జగన్మోహన్ రెడ్డి జైలుకు వెళ్ళినప్పుడు వైయస్ షర్మిల చేపట్టిన పాదయాత్రలో మొదటి నుంచి ముగింపు వరకు షర్మిల వెంట నడిచిన కాపు భారతి వైయస్ కుటుంబానికి ఎంతో నమ్మకంగా ఉన్న కాపు రామచంద్రారెడ్డి కుటుంబాన్ని కాదని మెట్టు గోవింద్ రెడ్డికి టికెట్ ఇవ్వడం అతను ఓటమిపాలవడం కనీసం టికెట్ వేరే వాళ్ళకి ఇవ్వాలని అనుకున్నప్పుడు అధిష్టానం వీళ్లను పిలిపించి వేరే వాళ్లకు టికెట్టు ఎందుకు ఇస్తున్నారో కనీసం వివరించకుండా మేము ఎవరికీ చెప్పాల్సిన అవసరం లేదన్నట్లు మా పార్టీ మేము ఎవరికైనా టికెట్ ఇస్తామని నిరంకుశ ధోరణిలో పార్టీ కోసం ముందు నుంచి కష్టపడ్డ నాయకులను విస్మరించి చేయడం పార్టీకి నష్టం వాటిల్లుతుందని కొంతమంది సీనియర్ నాయకులు అనుకుంటున్నారు.

అలాగే హిందూపురం నియోజకవర్గంలో ముందు నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ నవీన్ నిశ్చల్ వేణుగోపాల్ రెడ్డి అబ్దుల్ ఘని వంటి సీనియర్లను కాదని 2024 ఎన్నికల్లో బెంగళూరులో స్థిరపడ్డ దీపికా రెడ్డిని పోటీ చేయించారు ఈ పరిణామాలతో మనస్థాపం చెందిన నవీన్ నిశ్చల్ పార్టీకి రాజీనామా చేసి ఇటీవల జనసేన పార్టీలో జాయిన్ అయ్యాడు. అలాగే ఉమ్మడి అనంతపురం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శంకర్ నారాయణ కూడా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నాడు కారణం తన సొంత నియోజకవర్గమైన పెనుగొండలో తనకు తన అనుచర వర్గానికి సరైన గుర్తింపు లభించడం లేదని 2024 ఎన్నికలలో సిట్టింగ్ ఎమ్మెల్యే మంత్రి శంకర్ నారాయణను కాదని స్థానికేతురాలు కర్ణాటకలో స్థిరపడ్డ ఉషశ్రీ చరణ్‌ను పోటీ చేయించడం వలన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్రియాశీలక కార్యక్రమాలకు శంకర్ నారాయణ దూరముంటున్నాడు. దానికి తోడు తను అప్పుడప్పుడు పార్టీ కార్యక్రమాలలో పాల్గొన్నా ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వడం లేదని అసంతృప్తితో పార్టీ వీడే ఆలోచనలో ఉన్నట్లు అనుచరులు చర్చించు కొన్నట్లు సమాచారం. అదేవిధంగా అన్నమయ్య జిల్లా మదనపల్లి నియోజక వర్గంలో పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేసిన దేశాయి తిప్పారెడ్డిని కాదని సిట్టింగ్ ఎమ్మెల్యే నవాజ్ భాషను కాదని మాజీ మంత్రి అన్నమయ్య జిల్లా ఎంపీ వారికి తెలిసిన వ్యక్తి నిస్సార్ అహ్మద్‌ను స్థానిక స్థితిగతులు నియోజకవర్గంలో అవగాహన లేని వ్యక్తి ని మదనపల్లి నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు ప్రజలపై రుద్దడం ఎంతవరకు సమంజసమని స్థానిక నాయకులను కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.

అలాగే మరొక నియోజక వర్గం కదిరి ఇక్కడ కూడా 2024 ఎన్నికల్లో పోటీ చేసిన వ్యక్తి గత 30 సంవత్సరాలుగా బెంగళూరులో స్థిరపడ్డ మక్బూల్ అహ్మద్ ను సదరు మంత్రి ఎంపీ వారి మధ్య ఉన్న లావాదేవీలు సంబంధాల వలన టిక్కెట్టు ఇవ్వడం సిట్టింగ్ ఎమ్మెల్యే శిద్దారెడ్డి అనుచరులు మరికొంత మంది సీనియర్లు వ్యతిరేకంగా పనిచేయడం వలన మక్బూల్ అహమద్ ఓటమి పాలు కావడం జరిగింది.

ముందు నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే సిద్ధారెడ్డి జగన్‌తో పాటు ఉన్న ఎస్ఎండి ఇస్మాయిల్ పూల శ్రీనివాస్ రెడ్డి డాక్టర్ బత్తల హరి మాజీ ఎమ్మెల్యే జొన్న రామయ్య మాజీ మంత్రి షాకీర్ వంటి సీనియర్ నాయకులతో కనీసం చర్చించకుండా వలస నాయకులను ప్రోత్సహించడం వారి వల్ల పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడిన వారికి గుర్తింపు లేకపోవడంతో మనస్థాపం చెంది అప్పుడు కాపు రామచంద్రారెడ్డి ఇప్పుడు నవీన్ నిశ్చల్ ముమ్ముందు ఇంకా ఎవరెవరు రాజీ నామా చేస్తారో వేచి చూడాలి.

అలాగే ఇప్పుడు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా స్థానికంగా బలంగా నిత్యం కార్య కర్తలకు అందుబాటులో ఉన్న నాయకు లను కాదని వారి బంధు గణానికి ఆర్థికంగా బలంగా ఉన్న కొత్త వ్యక్తులకు మున్సి పాలిటీలో వారి వార్డులో కూడా సరిగ్గా పరిచయాలు లేని వ్యక్తులకు మున్సిపల్ చైర్మన్‌గా నిలబెట్టే ప్రయత్నాలు ఈ నియోజక వర్గాలలో జరుగుతు న్నాయని స్థానిక నాయకులు కార్యకర్తలు చర్చించుకుంటు న్నారు. మున్సిపల్ చైర్మన్‌గా పోటీ చేసే వ్యక్తి వ్యక్తిత్వం చూసి ఓట్లు వేస్తారు ఇలాంటివి పరిగణ లోకి తీసు కోకుండా తప్పుడు నిర్ణయాల వలన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి నష్టం చేకూర్చే అవకాశం ఉందని పార్టీలోని కొంత మంది నాయకులు కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

> **మాజీ మంత్రితో కదిరి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థికి సంబంధించి ఒప్పందం కుదిరినట్లు విశ్వనీయ సమాచారం. పార్టీకి పని చేసిన సీనియర్ నాయకులను కాదని ఎలాంటి రాజకీయ అనుభవం లేని పార్టీ కోసం ఎలాంటి పని చేయని వ్యక్తికి చేస్తున్నారని అతను కదిరి ఇంచార్జి సమీప బంధువు అని విశ్వసనీయ సమాచారం. ఇంకా వారి మధ్య ఎలాంటి ఒప్పందం ఎంతకు కుదిరినదో ఆ పార్టీ నాయకుల ద్వారా బయటకు రానుంది.**

# మన్మోహన్ సింగ్‌కు భారతరత్న ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొని ఆయనకు పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమానికి సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. విగ్రహావిష్కరణ అనంతరం మన్మోహన్ సింగ్ చిత్రపటానికి, విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ మన్మోహన్ సింగ్ భారతదేశానికి అందించిన సేవలను గుర్తుచేశారు. దేశం ఆర్థికంగా తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో ఆర్థిక సరళీకరణ విధానాలను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. 1991లో ఆర్థిక సంస్కరణలతో ప్రారంభమైన మార్పులు దేశ ఆర్థిక వ్యవస్థపై దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపాయని ఆయన అన్నారు. గచ్చిబౌలి వంటి హైదరాబాద్ ఐటీ కారిడార్ అభివృద్ధిని కూడా ఆర్థిక సంస్కరణల విస్తృత ప్రభావంతో సీఎం అనుసంధానించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ప్రక్రియలోనూ మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నారని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఆర్థిక సంస్కరణలతో పాటు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో ఆయన వ్యవహరించిన తీరును కూడా ప్రస్తావించారు. మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలను భవిష్యత్ తరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మన్మోహన్ సింగ్‌కు దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్నను ప్రదానం చేసి గౌరవించాలని సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆయన జ్ఞాపకార్థం దేశ రాజధాని ఢిల్లీలో సముచితమైన విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. మన్మోహన్ సింగ్ జీవితం, సరళత, ప్రజాసేవ, దేశం పట్ల ఆయనకున్న నిబద్ధత యువతకు, భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిచ్చేలా ఉండాలని సీఎం పేర్కొన్నారు. మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో అమలైన పలు సామాజిక సంక్షేమ చట్టాలు, విధానాలను కూడా రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జాతీయ ఆహార భద్రత చట్టం, అటవీ హక్కుల చట్టం, భూసేకరణ--పునరావాస చట్టం వంటి చర్యలను ఆయన గుర్తుచేశారు. వీటి ద్వారా గ్రామీణ ఉపాధి, ఆహార భద్రత, విద్య, సమాచార హక్కు, భూమి--పునరావాసం వంటి అంశాలకు చట్టపరమైన ప్రాధాన్యం లభించిందని సీఎం తన ప్రసంగంలో పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను ఆధునికీకరించడంలో మన్మోహన్ సింగ్ పోషించిన పాత్రతో పాటు, ఆయన నిరాడంబర జీవనశైలి, ప్రజాసేవ పట్ల నిబద్ధతను కూడా సీఎం గుర్తుచేశారు. జెన్-జీ, ఆల్ఫా, బీటా తరాలకు ఆయన జీవితాన్ని పరిచయం చేయడం ద్వారా దేశ సేవ పట్ల అవగాహన పెంచాలనే ఉద్దేశంతో విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. గచ్చిబౌలి విప్రో సర్కిల్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం హైదరాబాద్ ఐటీ రంగ అభివృద్ధి నేపథ్యంలోనూ ప్రాధాన్యత సంతరించుకుంది. విగ్రహం ఏర్పాటు ద్వారా ఆర్థిక సంస్కరణల కాలాన్ని, దేశ అభివృద్ధిలో మన్మోహన్ సింగ్ పాత్రను, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ కాలంలోని ఆయన సేవలను భవిష్యత్ తరాలకు గుర్తుచేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని సీఎం వివరించారు.

# సంపాదకీయం

## మంత్రులకు అసలైన అగ్ని పరీక్ష




**న్యూ**ఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయం సేవా తీర్థ్ వేదికగా కేంద్ర మంత్రులందరితో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పాటు నిర్వహించిన ఉన్నత స్థాయి మేధోమథన సదస్సు హాట్ టాపిక్ అయింది. ఎన్డీయే-3 ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పూర్తి స్థాయి మంత్రుల మండలితో ప్రధాని ఇంతటి సుదీర్ఘ అంతర్గత సమీక్ష నిర్వహించడం ఇదే ప్రథమం. కేవలం విధానపరమైన నిర్ణయాలకే పరిమితం కాకుండా.. గత కొన్ని నెలలుగా వివిధ మంత్రిత్వ శాఖల పనితీరు, ప్రజా సమస్యల పరిష్కారంలో చూపిస్తున్న వేగం, వికసిత్ భారత్ రోడ్‌మ్యాప్ అమలుపై మోదీ లోతుగా సమీక్షించారు. కేంద్ర మంత్రులను ఎనిమిది ప్రత్యేక బృందాలుగా విభజించి, ప్రతి గ్రూపుతో విడివిడిగా సంభాషిస్తూ క్షేత్రస్థాయి ఫలితాలు ఎలా ఉన్నాయో కూలంకషంగా ఆరా తీశారురెండు రోజుల మేధోమథన సదస్సు ప్రధానంగా పరిపాలనా సంస్కరణలు, ప్రజా సంక్షేమ పథకాల డెలివరీ మెకానిజం చుట్టూనే తిరిగింది. బ్యూరోక్రసీపై పూర్తిగా ఆధారపడటం మానుకోవాలని, మంత్రులు స్వయంగా ప్రాజెక్టుల పురోగతిని పర్యవేక్షించాలని మోదీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. యువత, మహిళలకు ఉద్దేశించిన కేంద్ర ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయికి ఎంతవరకు చేరుతున్నాయన్న దానిపై గ్రౌండ్ రిపోర్టులు తెప్పించుకుని పరిశీలించారు. శాఖల మధ్య సమన్వయ లోపం ఉండకూడదని, ఫైళ్ల క్లియరెన్స్‌లో జాప్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. తాజా సమీక్షలో పలువురు మంత్రుల పనితీరు ఆశాజనకంగా లేదని తేలడంతో పాటు, కొందరి పోర్ట్‌ఫోలియోల్లో ఆశించిన వేగం కనిపించలేదన్న నివేదికలను ప్రధాని నేరుగా వారి ముందే ఉంచినట్లు సమాచారం.ఈ భారీ కసరత్తు పూర్తవడంతో కేంద్ర కేబినెట్‌లో ఎవరిని ఉంచాలి? ఎవరిని సాగనంపాలి? అనే అంశంపై ప్రధాని మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ నాయకత్వానికి ఒక స్పష్టమైన క్లారిటీ వచ్చినట్లు చెబుతున్నారు. గత ఎన్నికల తర్వాత కూటమి భాగస్వామ్యాల లెక్కలతో ఏర్పడిన మంత్రివర్గంలో కొందరికి అదనపు బాధ్యతలు ఉండగా, మరికొందరు ఆశించిన స్థాయి పనితీరును కనబరచలేకపోయారు. రాబోయే పలు కీలక రాష్ట్రాల శాసనసభ ఎన్నికల సమీకరణాలు, సామాజిక సమతుల్యత, పాలనా సామర్థ్యమే గీటురాయిగా మంత్రుల ర్యాంకింగ్‌లు, రిపోర్ట్ కార్డులను సిద్ధం చేశారు. ఆశించిన ఫలితాలు ఇవ్వని పలువురు మంత్రులను కేబినెట్ నుంచి తప్పించి పార్టీ సంస్థాగత బాధ్యతలకు పరిమితం చేయవచ్చని తెలుస్తోందికేంద్ర మంత్రివర్గంలో పెను మార్పులు, చేర్పులు త్వరలోనే ఉండబోతున్నాయన్న సంకేతాలు బలంగా కనిపిస్తున్నాయి. దాదాపు 15 నుంచి 17 కొత్త ముఖాలకు కేబినెట్ లేదా సహాయ మంత్రుల హోదాలో చోటు కల్పించవచ్చని, యువ నాయకత్వానికి ప్రాధాన్యత ఇస్తూనే పనితీరు బాగున్న కొందరు సహాయ మంత్రులకు పదోన్నతులు కల్పించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. సంస్కరణల అమలు, వికసిత్ భారత్-2047 ప్లాన్ అమలుపై సమీక్ష నిర్వహించి,, కీలక నిర్ణయాలు తీసుకునేందుకు ఈ చింతన్ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. అలాగే జాతీయ స్థాయిలో తాజా రాజకీయ పరిణామాలు, మంత్రుల పనితీరు సమీక్ష, భవిష్యత్ ప్రణాళికలు రూపొందించడం, ప్రభుత్వ ప్రాధాన్యతలు మార్చుకోవడంపై ఫోకస్ చేసే అవకాశం ఉంది. మరోవైపు విజన్-2047 స్వల్పకాలిక, దీర్ఘకాలిక రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేయడానికి రంగాల వారీగా 10 కార్యదర్శుల బృందాలను ఇప్పటికే ఏర్పాటు చేసిన ప్రధాని మోడీ.. వాటిపై ఇవాళ మరోసారి ప్రజంటేషన్లు తీసుకునే అవకాశం ఉంది. అలాగే జంతర్ మంతర్ ఆందోళనల తర్వాత మంత్రుల పనితీరుపై ప్రధాని మోడీ రెగ్యులర్‌గా సమీక్షలు నిర్వహిస్తున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలని కోరుతున్నారు. అంతే కాదు వీటిపైనా నివేదికలు తెప్పించుకుంటున్నారు. తాను కూడా స్వయంగా సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. తాజా నివేదికల ఆధారంగా మంత్రుల పనితీరును ప్రధాని కొలవబోతున్నారు. అలాగే దీంతో పాటు రాబోయే రోజుల్లో మరిన్ని చింతన్ శిబిర్ లు కూడా ఏర్పాటు చేస్తామని సంకేతాలు ఇస్తున్నారు. ఇవన్నీ అంతిమంగా కేబినెట్ లో మార్పులపై మంత్రుల్లో వస్తున్న వ్యతిరేకతను వాడుకుంటూ ప్రక్షాళనకు ప్రధాని దారులు తెరుస్తారనే చర్చ కూడా జరుగుతోంది. అదే జరిగితే త్వరలో చేపట్టే కేబినెట్ ప్రక్షాళనపై చింతన్ శిబిర్ రిపోర్టుల ప్రభావం కూడా ఉండబోతోంది. సమయంలో కీలక భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జేడీయూలతో పాటు ఇతర ఎన్డీయే మిత్రులకు ప్రాతినిధ్యం పెంచడం లేదా అదనపు శాఖలు కేటాయించే కసరత్తు కూడా కొలిక్కి వచ్చినట్లు సమాచారం. ఈ చింతన్ శిబిర్ కేవలం సమీక్ష మాత్రమే కాదని, మోదీ మార్క్ నిర్దాక్షిణ్య ప్రక్షాళనకు వేసిన బలమైన పునాది అని గట్టిగానే గుసగుసలు వినిపిస్తున్నాయి.

# ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న జనసేన

**విశాఖపట్టణం - సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను జనసేనపార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు, కూటమి భాగస్వామ్య పక్షాలతో పక్కా సమన్వయం కోసం ఐదుగురు సభ్యులతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏర్పాటు చేశారు. ఎన్నికల వేళ గ్రౌండ్ లెవెల్‌లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కా వ్యూహంతో ముందుకు వెళ్లేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారుఈ కొత్త కమిటీ ఇప్పటికే జనసేన పార్టీలో క్రియాశీలకంగా ఉన్న 14 మంది సభ్యుల ప్రధాన కమిటీతో కలిసి సంయుక్తంగా పని చేయనుంది. ఈ ఐదుగురు సభ్యుల కమిటీ రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించనుంది. వివిధ జిల్లాల్లో పార్టీ బలాబలాలు, డివిజన్లు మరియు స్థానిక సంస్థల వారీగా అభ్యర్థుల గెలుపు అవకాశాలు, పొత్తుల సమన్వయంలో ఎదురవుతున్న సవాళ్లపై లోతుగా అధ్యయనం చేసి ఈ ప్రత్యేక టీమ్ ఒక సమగ్ర నివేదికను సిద్ధం చేయనుంది.

ఈ కమిటీలు క్షేత్రస్థాయి నుంచి సేకరించి సమర్పించే నివేదికల ఆధారంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీ సీనియర్ నేతలతో కలిసి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. ఆ నివేదికల ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలు, సీట్ల సర్దుబాట్లపై పవన్ కల్యాణ్ క్యాడర్‌కు దిశానిర్దేశం చేయనున్నారు.

మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల వేళ సీట్ల పంపకాలపై కూటమిలో అంతర్గత చర్చలు నడుస్తున్న తరుణంలో జనసేన ఈ ప్రత్యేక కమిటీని రంగంలోకి దించడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. స్థానిక సంస్థల ఎన్నికలు జనసేన పార్టీ నాయకత్వానికి ఒక సవాల్ గా మారాయి. ఇన్నాళ్లూ ఓపిక పట్టిన నేతలు ఎంతకాలం నుంచో ఈ ఎన్నికల కోసం కాచుక్కూర్చుని ఉన్నారు. పవన్ కల్యాణ్ పై అభిమానంతో పార్టీ జెండాను పట్టుకుని వదలకుండా




పన్నెండేళ్ల నుంచి చేతబూనిన వారు ఈ ఎన్నికల్లో ఖచ్చితంగా పోటీ చేయాలని భావిస్తున్నారు. పవన్ కల్యాణ్ కూడా సీట్ల షేరింగ్ లో రాజీ పడబోమని చెప్పడం కొంత ఊరట నిచ్చే అంశమే. అయితే చివరకు సీట్ల షేరింగ్ విషయంలో పవన్ కల్యాణ్ కు పెద్ద సమస్య గా మారనుంది. సీట్ల షేరింగ్ ఎక్కువ అడిగితే వాటిని ఖచ్చితంగా గెలిపించుకోవాలి. తగ్గించుకుంటే ప్రత్యర్థులే కాకుండా సొంత పార్టీ నేతల నుంచి కూడా ప్యాకేజీ అంటూ కామెంట్స్ చేస్తారు. రాజీ పడకుండా.. రహదారి ఏంటి? అన్నదే పవన్ కల్యాణ్ ముందున్న ప్రశ్న. ఏ నిర్ణయమైనా పవన్ కల్యాణ్ కు ఈ ఎన్నికలు పెద్ద సమస్యగా మారాయని చెప్పాలి. ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు విషయంలో జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చాలా స్పష్టమైన, దూకుడు వైఖరిని ప్రదర్శిస్తున్నారు. కాకినాడలో జరిగిన పార్టీ కీలక సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలు కూటమి రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీశాయి.

2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీని కూటమిలోకి తెచ్చే క్రమంలో టీడీపీ అభ్యర్థన మేరకు జనసేన సీట్లు తగ్గించుకుంది. కానీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ సీట్లు తగ్గిస్తామంటే ఒప్పుకునేది లేదని పవన్ కళ్యాణ్ తేల్చి చెప్పారు. చేసిన త్యాగాలు చాలని, సీట్ల కేటాయింపులో ఎలాంటి రాజీ పడబోమని స్పష్టం చేశారు. స్నేహపూర్వక పోటీకైనా సిద్ధమని ప్రకటించడం ఇప్పుడు సరికొత్త రాజకీయాలకు తెరలేపినట్లయింది. పొత్తుల లెక్కల్లో భాగంగా ఎక్కడైనా స్థానిక నాయకత్వాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే, కొన్ని స్థానాల్లో స్నేహపూర్వక పోటీ కి వెడదామని క్యాడర్‌కు దిశా నిర్దేశం చేశారు. అంటే ఒకరకంగా టీడీపీకి పరోక్షంగా వార్నింగ్ ఇచ్చిన పవన్ కల్యాణ్ అదే సమయంలో స్థానికంగా కూటమి నేతల మధ్య సయోధ్యను కుదుర్చుకోవాల్సిన బాధ్యత మీదేనంటూ లోకల్ లీడర్లపై పవన్ నెట్టేయడం కూడా ఒక రకంగా చర్చకు దారి తీసింది. ఒకే వార్డులో కూటమిలోని రెండు పార్టీలు పోటీ పడాల్సి వచ్చినా వెనకడుగు వేయొద్దని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. అదే సమయంలో కూటమి ధర్మం పాటించాలని పిలుపు నిచ్చారు. గత ఐదేళ్లలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని నిలబడిన గ్రౌండ్ లెవల్ కార్యకర్తలను, వీరమహిళలను ఈ ఎన్నికల ద్వారా బలోపేతం చేయాలనేది పవన్ ప్రధాన లక్ష్యం. 15 శాతం సీట్లు మాత్రమే జనసేనకు ఇస్తారంటూ వస్తున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు.

వంద శాతం స్ట్రయిక్ రేట్ లక్ష్యంగా పనిచేయాలని పార్టీకి బలమున్న ప్రతి చోటా అభ్యర్థులను నిలబెట్టాలని, అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే స్థానిక ఎన్నికల్లో కూడా 100 శాతం విజయాల రేటును నమోదు చేయాలనే వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు.ఎన్నికల సన్నద్ధత, వ్యూహాల కోసం ప్రత్యేక కమిటీని నియమించారు. ప్రచార కమిటీ బాధ్యతలను మంత్రి కందుల దుర్గేష్‌కు అప్పగించారు. మీరు అన్నట్లుగానే పవన్ కళ్యాణ్ తాజా స్పీచ్‌ను బట్టి చూస్తే, స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ తన ఆత్మగౌరవాన్ని, క్యాడర్ ప్రయోజనాలను పణంగా పెట్టి సీట్ల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గే సూచనలు కనిపించడం లేదు. మరి చివరకు ఏం జరుగుతుందన్నది చూడాలి.

# పారిశ్రామిక పర్యటనలో ఆదర్శ పాఠశాల విద్యార్థులు

**పగిద్యాల- సూర్య వాస్తవం**

నంద్యాల జిల్లా పగిద్యాల మండలంలో ఆదర్శ పాఠశాలలో వృత్తి విద్యలో భాగంగా పగిద్యాల విద్యార్థులు పారిశ్రామిక పర్యటనలో పాల్గొన్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఐటీ వొకేషనల్ కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థులు నందికొట్కూరులోని బసిరెడ్డి డిగ్రీ కళాశాలను సందర్శించారు. విద్యార్థుల్లో వృత్తి విద్యపై అవగాహన పెంపొందించడంతో పాటు,ఐటీ రంగంలో అందుబాటులో ఉన్న అవకాశాలు, సాంకేతిక నైపుణ్యాలపై ప్రత్యక్ష అవగాహన కల్పించేందుకు ఈ పర్యటనను నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాలలోని కంప్యూటర్ ల్యాబ్‌ను సందర్శించి, కంప్యూటర్లు ఐటీ రంగానికి సంబంధించిన వివిధ అంశాలను ఆసక్తిగా తెలుసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మన్సూర్ అహ్మద్, అధ్యాపకులు విజయకుమార్ విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్ పనితీరు ఐటీ రంగంలో వస్తున్న మార్పులు సాంకేతిక విద్య ప్రాధాన్యత తదితర అంశాలను వివరించారు. విద్యార్థులు తమకు ఉన్న సందేహాలను అడిగి




నివృత్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్ సలీం భాష మాట్లాడుతూ. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు పాఠ్యాంశాలపై పట్టుతో పాటు కంప్యూటర్ సాంకేతిక నైపుణ్యాలు కూడా ఎంతో అవసరమని అన్నారు. వృత్తి విద్యను ప్రాక్టికల్‌గా నేర్చుకోవడం ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాలు ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు. విద్యార్థులకు తరగతి గది బోధనతో పాటు క్షేత్రస్థాయి అవగాహన కల్పించేందుకు ఇలాంటి పర్యటనలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మల్లికార్జున రెడ్డి, వొకేషనల్ ట్రైనర్ సి. బాలకృష్ణ యాదవ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పల్లె పండుగ--3.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

### - సీడ్స్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి





**డోన్ -సూర్య వాస్తవం**

బద్వేల్ నియోజకవర్గం కూటమి ప్రభుత్వం ఈ నెల 29వ తేదిన ఉదయగిరి నియోజకవర్గంలో జరగనున్న పల్లె పండుగ--3.0 కార్యక్రమం నేపథ్యంలో శనివారం బద్వేల్ నియోజకవర్గ జనసమీకరణ పరిశీలకులు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి బద్వేల్ లో బద్వేల్ నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ సూర్య నారాయణ రెడ్డి ఆదేశానుసారం నిర్వహించిన మండలాల వారీగా కూటమి ముఖ్య నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో బద్వేల్ మునిసిపాలిటీ బద్వేల్ రూరల్, గోపవరం మండలం అట్లూరు మండలం, కలసపాడు మండలం బి. కొడూరు మండలం శ్రీ అవధూత కాశీనాయన మండలం పోరుమామిల్ల మండలాల నాయకులు, మండలం జనసమీకరణ పరిశీలకులతో వారికి టార్గెట్ ఇచ్చిన జనాభా ను వెహికల్స్ లో కార్యక్రమంకు చేర్చాల్సిన భాధ్యతను, జాగ్రత్తలు పాటించి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసమీకరణ పరిశీలకులు నరసింహులు, జనసమీకరణ పరిశీలకులు మహబూబ్ కాశీం బద్వేల్ నియోజకవర్గ కూటమి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను కలిసిన పత్తికొండ బీజేపీ నాయకులు

### - పార్టీ బలోపేతం, క్షేత్రస్థాయి పరిస్థితులపై చర్చ

### ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వినతి

**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను పత్తికొండ బీజేపీ ప్రతినిధుల బృందం మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించింది. ఈ సందర్భంగా పత్తికొండ నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలు, ప్రజా సమస్యలు, స్థానికంగా ఎదురవుతున్న ఇబ్బందులు తదితర అంశాలను రాష్ట్ర అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లారు.అనంతరం నియోజకవర్గానికి సంబంధించిన ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పీవీఎన్ మాధవ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ తరఫున కృషి చేయాలని ప్రతినిధులు కోరారు. అలాగే పత్తికొండ నియోజకవర్గంలో బీజేపీని మరింత బలోపేతం చేయడం, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మరింత చేరువ కావడం వంటి అంశాలపై కూడా చర్చించినట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రతినిధులతో మాట్లాడి, వారు ప్రస్తావించిన అంశాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు వెల్లడించారు.

## ఘనంగా ఎస్‌సీటీపీసీల పాసింగ్ అవుట్ పరేడ్...!

**- గౌరవ వందనం స్వీకరించిన మంత్రి పయ్యావుల కేశవ్ - కలెక్టర్ ఓ. ఆనంద్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి - 683 మంది నూతన కానిస్టేబుళ్లకు అభినందనలు తెలిపిన మంత్రి,కలెక్టర్**





**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** అనంతపురం నగరంలోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్ (పీటీసీ) పరేడ్ గ్రౌండ్‌లో ఎస్‌సీటీపీసీ (సివిల్) 2025--26 బ్యాచ్ పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ తరపున అందించిన గౌరవ వందనాన్ని మంత్రి పయ్యావుల కేశవ్ స్వీకరించారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 683 మంది కానిస్టేబుళ్లు పోలీస్ శాఖలో విధుల్లో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నూతన కానిస్టేబుళ్లకు అభినందనలు తెలిపారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, అంకితభావం, నిబద్ధతతో పనిచేస్తూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా సేవలందించాలని ఆకాంక్షించారు.

## వజ్ర ప్రహార్‌తో జిల్లావ్యాప్తంగా... విస్తృత కార్డన్ సెర్చ్...!

**- అసాంఘిక కార్యకలాపాలు, మాదకద్రవ్యాల నియంత్రణే లక్ష్యం : ఎస్పీ పి. జగదీష్**





**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఆదేశాల మేరకు 'వజ్ర ప్రహార్' కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలు, మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, నేరాల నియంత్రణ లక్ష్యంగా 27 ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేపట్టారు.తనిఖీల్లో భాగంగా 349 ఇళ్లను పరిశీలించిన పోలీసులు, సరైన రికార్డులు లేని 34 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే 515 మంది అనుమానితులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గతంలో నమోదైన ఎన్‌డీపీఎస్ కేసుల్లో నిందితులైన ముగ్గురికి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చారు.శాంతిభద్రతల పరిరక్షణతో పాటు మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం, ఇతర అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించి ప్రజలు సహకరించాలని పోలీసులు కోరారు.

## కొండకమర్లలో విజయవంతంగా అంగన్వాడీ ఉత్సవం

**- గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై అవగాహన**
**- అంగన్వాడీ కేంద్రాల్లో అందుతున్న సేవలను వివరించిన సిబ్బంది**



**పుట్టపర్తి - సూర్య వాస్తవం :** మండలంలోని కొండకమర్ల అంగన్వాడీ కేంద్రం-2లో శనివారం నిర్వహించిన అంగన్వాడీ ఉత్సవం విజయ వంతంగా జరిగింది. ఐసీడీఎస్ పీడీ ప్రమీల ఆదేశాల మేరకు సీడీపీఓలు రెడ్డి రమణమ్మ, గాయత్రి, సూపర్‌వైజర్ విజయలక్ష్మి నేతృత్వంలో అంగన్వాడీ టీచర్ ఖాజీ రహమతున్నీసా ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం కోసం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను వివరించారు. శిశువుల సమగ్ర వికాసానికి అంగన్వాడీ కేంద్రాలు దోహదపడతాయని తెలిపారు. అందుబాటులో లభించే పోషకాహారం, ఆకుకూరలు, కాయగూరలు, పండ్లను ఆహారంలో చేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రయోగాత్మకంగా వివరించారు.అనంతరం ఆరోగ్యవంతులైన గర్భిణులు, బాలింతలు, శిశువులను సన్మానించారు. అంగన్వాడీ లబ్ధిదారులు తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రత్నమ్మ, భారతి, సుజాత, ఆయాలు సరస్వతి, సులోచన, సుజాతతో పాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# యువత విజయాలే... వికసిత్ భారత్‌కు బలమైన పునాది...!

**- ఉన్నత విద్యతో పాటు భవిష్యత్‌లో వ్యాపారవేత్తలుగా ఎదగాలి**
**- వికసిత్ భారత్--2047లో యువతదే కీలక పాత్ర ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ**




**అనంతపురం - సూర్య వాస్తవం :** ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన "యువత భవితకు భరోసా" కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనలో యువత పాత్ర అత్యంత కీలకమని అన్నారు.ప్రతి విద్యార్థి వ్యక్తిగతంగా ఎదగడంతో పాటు సమాజానికి, దేశానికి ఉపయో గపడేలా తన ప్రతిభను తీర్చిదిద్దుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ ఆలోచనలు, సృజ నాత్మకతను నాయకులు, ప్రభుత్వంతో పంచుకోవాలని, సమాజ అభివృద్ధికి ఉపయోగపడే సూచనలను ప్రభుత్వానికి అందించడం ద్వారా పాలనలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుని నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించే వరకు కష్టపడి పనిచేయాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఉన్నత విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు భవిష్యత్తులో వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.ప్రభుత్వం అందిస్తున్న వివిధ అప్లికేషన్లు, డిజిటల్ సేవలపై అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జ్ఞానం, నైపుణ్యం, క్రమ శిక్షణ, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి కుటు ంబానికి, అనంతపురానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సరిత, పూర్వ విద్యార్థి సత్యరామ్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులను ఎంపీ అభినందించారు.



"యువత కలలు కనాలి.. లక్ష్యాలను నిర్దేశించుకోవాలి.. వాటిని సాధించే వరకు నిరంతరం కృషి చేయాలి. యువత సాధించే విజయాలే వికసిత్ భారత్--2047 నిర్మాణానికి బలమైన పునాది" అని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

# అరకొర సమాచారంతో వస్తే ఎలా?

**- ఐసీడీఎస్ అధికారుల పని తీరుపై కలెక్టర్ ఆనంద్ ఆగ్రహం**
**- ఎన్నిసార్లు చెప్పినా మీరు మారరా అంటూ అసహనం**
**- అంగన్వాడీ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ఇమ్మంటే ఎందుకు ఇవ్వడం లేదని నిలదీత**
**- ఎన్నికల నోటిఫికేషన్ వస్తే అప్పుడు పరిస్థితి ఏం కావాలని మండిపాటు**
**- అప్పటి వరకు పిల్లలు పస్తులతో మాడాల్సిందేనా అంటూ ప్రశ్న**
**- శింగనమల, నార్పల, ఉరవకొండ, కళ్యాణదుర్గం సీడీపీఓలకు చార్జెస్ ఫ్రేం చేయాలని పీడీకి ఆదేశం**




**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :**'నేను ఈ జిల్లాకు కలెక్టర్‌గా వచ్చినప్పటి నుంచి చూస్తున్నా. ఐసీడీఎస్ శాఖ పని తీరు ఏమాత్రం బాగోలేదు. సమీక్ష సమావేశాలు నిర్వహించిన ప్రతిసారి చెబుతున్నా.. మీ పని తీరులో మార్పు రావడం లేదు. మీకు ఆషామాషీగా ఉందా? ఏమనుకుంటున్నారు? పదేపదే చెబుతున్నా.. అలా వినడం, ఇలా వదిలేయడం అలవాటైపోయింది. జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ ఖాళీలను గుర్తించి రోస్టర్ ప్రకారం నోటిఫికేషన్ ఇచ్చి, త్వరితగతిన నియామకాలు చేపట్టాలని గత సమావేశాల్లో చెప్పా. ఇప్పటి వరకు రోస్టర్ తయారు చేయలేదు. నోటిఫికేషన్ ఇవ్వలేదు. ఏమనుకోవాలి? మరి కొన్ని రోజుల్లో ఎన్నికల కోడ్ వచ్చేస్తోంది. అప్పటి వరకు పిల్లలు ఆకలితో మాడాల్సిందేనా? ఇదేనా మీరు చేసే ఉద్యోగం' అంటూ అనంతపురం కలెక్టర్ ఆనంద్ ఐసీడీఎస్ పీడీ సాజిదా బేగం సహా సీడీపీఓలపై అసహనం వ్యక్తం చేశారు. అనంతపురంలోని రెవెన్యూ భవన్ లో శనివారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి కలెక్టర్ ఆనంద్ హాజరయ్యారు. పీడీ సాజిదా బేగం, సీడీపీఓలు, అన్ని ప్రాజెక్టుల సీడీపీఓలు, ఇస్నిప్ విభాగ ఉద్యోగులు పాల్గొన్నారు. ముఖ్యంగా టేక్ హోం రేషన్(టీహెచ్ఆర్), అంగన్వాడీ ఖాళీల గుర్తింపు, భర్తీ ప్రక్రియ, పిల్లల ఎదుగుదల(గ్రోత్) అంశాలపై ఆయన ప్రాజెక్టుల వారీగా చర్చించారు. సమావేశం ప్రారంభంలోనే ఐసీడీఎస్ పీడీ సాజిదా బేగం పని తీరు, మాట తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. గత సమావేశాల్లో చర్చించిన అంశాలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యల గురించి వివరించాలని కలెక్టర్ ఆదేశించగా.. పీడీ ఏ ఒక్క అంశం గురించి కూడా చెప్పలేకపోవడంతో కలెక్టర్ మండిపడ్డారు. గత సమావేశంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సీడీపీఓలకు ఛార్జ్ మెమో ఇవ్వాలని ఆదేశించినట్లు కలెక్టర్ గుర్తు చేశారు. ఆ అంశం ఏమైందని ప్రశ్నిస్తే.. పీడీ సరైన సమాధానం చెప్పలేకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పైకి రాసి పంపినా, ఇంకా అక్కడి నుంచి ఏమీ రాలేదంటూ సాకులు, కథలు చెప్పొద్దని స్పష్టం చేశారు. అంగన్వాడీ కేంద్రాల భర్తీకి సంబంధించి ఎందుకు నోటిఫికేషన్ ఇవ్వలేదని కలెక్టర్ నిలదీయగా.. శింగనమల సీడీపీఓ లలితమ్మ, నార్పల సీడీపీఓ భారతి, ఉరవకొండ సీడీపీఓ శ్రీదేవి, కళ్యాణదుర్గం సీడీపీఓ లక్ష్మీప్రసన్న తనకు ఇంత వరకు జాబితా ఇవ్వలేదని పీడీ



చెప్పడంతో కలెక్టర్ నిప్పులు చెరిగారు. ఆ నలుగురికీ చార్జెస్ ఫ్రేమ్ చేయాలని పీడీ సాజిదాను ఆదేశించారు. లేకపోతే రిపోర్ట్ తయారు చేసి తనకు చూపెట్టాకే.. డైరెక్టరేట్ కు పంపాలని, ఆ తరువాత తానే స్వయంగా డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డితో మాట్లాడుతానని తేల్చిచెప్పారు. తానేదో చెప్పానని, మాట వరుసకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటే కుదరదని, కచ్చితంగా చర్యలు ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. లేకపోతే పీడీపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎస్ఆర్ఎస్ మ్యాపింగ్ ప్రక్రియలో ఎందుకు జాప్యం జరుగుతోందని కలెక్టర్ ప్రశ్నించారు. దానికీ సరైన సమాధానం చెప్పలేకపోయారు. సమావేశం ప్రారంభం నుంచీ ముగిసే వరకు వాడివేడిగా కొనసాగింది.

## చెన్నకేశవస్వామి ఆలయ నిర్మాణానికి 5,116వితరణ

**పామిడి- సూర్య వాస్తవం:** మండల కేంద్రమైన పామిడి పట్టణంలోని ప్రసిద్ధి చెందిన పురాతన చెన్నకేశవస్వామి దేవాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో పునర్నిర్మాణం కొరకు నార్పేపల్లి జగన్మోహన్ ఆయన సతీమణి ప్రసన్నలక్ష్మి కుటుంబం సమేతంగా5,116 రూపాయలను విరాళంగా ఆలయ ప్రధాన పురోహితులు పురుషోత్తంకీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవంతుడు లేనిది మానవుడు లేడు అలాంటి దేవుని ఆలయ నిర్మాణానికి చంద్రునికి నూలు పోగువలే నాయొక్క చిన్నపాటి విరాళంను అందజే శానన్నారు.
ఈ కార్యక్రమంలో నర్సేపల్లి జగన్మోహన్, ప్రసన్నలక్ష్మి కుటుంబ సభ్యులు,ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి ఘన స్వాగతం

- రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆదినారాయణ యాదవ్
- పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ ఓబీసీ మోర్చా నేత



**అనంతపురం - సూర్య వాస్తవం :** సేవా సంకల్ప అభియాన్ -- అంగన్వాడీల ఉత్సవం కార్యక్రమంలో భాగంగా అనంతపురం నగరానికి విచ్చేసిన భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్‌ను బీజేపీ ఏపీ ఓబీసీ మోర్చా వైస్ ప్రెసిడెంట్ గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అంగన్వాడీల సంక్షేమం,మహిళలు--చిన్నారులకు అందుతున్న సేవలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై నాయకుల మధ్య చర్చ జరిగింది. ప్రజలకు మరింత చేరువగా సేవా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ఓబీసీ మోర్చా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేజీబీవీల్లో విద్యార్థినులకు భద్రత కల్పించాలి

- ఆత్మకూరు ఘటనలో గాయపడిన విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలి
- ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ గౌడ్ డిమాండ్

**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** జిల్లాలోని కేజీబీవీ పాఠశాలల్లోని విద్యార్థినుల భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్ గౌడ్ డిమాండ్ చేశారు. జిల్లాలోని ఆత్మకూరు కేజీబీవీలో చదువుతున్న ఓ విద్యార్థిని గురువారం రాత్రి 9 గంటలకు హాస్టల్ భవనం నుంచి కిందపడటంతో కాలు చేయి విరిగి తీవ్రంగా గాయపడినట్లు ఆయన తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే విద్యార్థినిని ఆసుపత్రికి తరలించడంలో జాప్యం జరిగిందని, దీంతో ఆమె తీవ్ర నొప్పితో బాధపడాల్సి వచ్చిందని ఆరోపించారు. ఒకరోజు ఆలస్యంగా ఆస్పత్రికి తరలించడంతో అనంతపురంలోని పెద్దాసుపత్రిలో కోలుకుంటున్న విద్యార్థినిని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్ గౌడ్ పరామర్శించారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని, అవసరమైతే ఉన్నత స్థాయి వైద్యసేవలు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థినికి మెరుగైన చికిత్స అందించే విషయంలో కేజీబీవీ అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలని కోరారు. కేజీబీవీల్లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా హాస్టల్ భవనాలు, భద్రతా ఏర్పాట్లు, విద్యార్థినుల పర్యవేక్షణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం బాధితురాలి బంధువులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. విద్యార్థినికి ఎటువంటి సమస్య వచ్చినా ఏఐఎస్ఎఫ్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి నాని, నగర సహాయ కార్యదర్శి అబ్దుల్, నగర నాయకులు బాబీ, రిషి, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

## గేట్స్ కాలేజీలో సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన




**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి మండలం రాజాపురం గ్రామం దగ్గర వున్నా డాక్టర్ బీఆర్ అంబే ద్కర్ గురుకులం గర్ల్స్ స్కూల్ అం డ్ కాలేజీ, రాజాపురం విద్యార్థులకు వొకే షనల్ విద్యలో భాగంగా ఇండ స్ట్రి యల్ విజిట్ నిర్వహించారు.ఇం దులో భాగంగా విద్యార్థులు గేట్స్ ఇ న్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీని సంద ర్శించారు.ఈ సందర్భంగా 9వ,10వ తరగతులతో పాటు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు క ళాశాలలోని వివిధ విభాగాలు,ల్యా బొరేటరీలు,సాంకే తిక పరికరాలను పరిశీలించారు.ల్యాబ్‌లలో నిర్వహిం చే ప్రయోగాలు,పరికరాల వినియో గం,సాంకేతిక విద్యకు సంబంధించి న అంశాలను అక్కడి సిబ్బంది వి ద్యార్థులకు వివరించారు.అలాగే క ళాశాల ప్రాంగణంలోని వివిధ విభా గాలను విద్యార్థులు సందర్శించి వి వరాలు తెలుసుకున్నారు.పుస్తకాల్లో నేర్చుకున్న అంశాలను ప్ర త్యక్షంగా పరిశీలించడం ద్వారా విద్యార్థుల్లో సాంకేతి క పరిజ్ఞానం,నైపుణ్యాలపై ఆసక్తి పెరిగిందని ఉపాధ్యా యులు తెలిపారు.ఈ కార్య క్రమంలో ప్రిన్సి పల్ అరుణ కుమారితో పాటు కళా శాల సిబ్బంది పాల్గొని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు.ఫొటో క్యాప్షన్ గేట్స్ ఇన్స్టి ట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ల్యాబ్‌లు, సాంకేతిక పరికరాలను పరిశీలిస్తున్న డాక్టర్ బీఆర్ అం బేద్కర్ గురుకు లం గర్ల్స్‌అండ్ కాలే జీ విద్యార్థులు.

# ప్రజా సేవకు ఎంపీ నిధులు..

- రూ.75 లక్షలతో ఎన్టీఆర్ విశ్రాంతి భవనం...!
- క్రిటికల్ కేర్, ట్రామా కేర్ విభాగాల అభివృద్ధికి విజ్ఞప్తి
- రోజూ 3 వేల మందికి పైగా ఓపీ.. 1,200 మంది ఇన్‌పేషెంట్లు
- ఆసుపత్రిలో పడకల సంఖ్య పెంచాలని కోరిన : ఎంపీ అంబికా
- కార్యక్రమంలో పాల్గొన్న వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కలెక్టర్ ఓ. ఆనంద్




**అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం :** అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాల ప్రాంగణంలో ఎంపీ లాడ్ నిధులతో సుమారు రూ.75 లక్షల వ్యయంతో నిర్మించిన ఎన్టీఆర్ విశ్రాంతి భవనాన్ని అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యాశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కలిసి ప్రారంభించారు.ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో ఈ విశ్రాంతి భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ఆసుపత్రిలో మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.ప్రభుత్వ ఆసుపత్రి ఓపీ విభాగానికి ప్రతిరోజూ 3,000 మందికి పైగా రోగులు వస్తుండగా, సుమారు 1,200 మంది ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రిలో 689 పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నందున, పడకల సంఖ్యను పెంచడంతో పాటు మౌలిక సదుపాయాలను మరింత మెరుగు పరచాలని మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరారు.అదేవిధంగా క్రిటికల్ కేర్, ట్రామా కేర్ విభాగాలను మరింత అభివృద్ధి చేస్తే జిల్లా ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎంపీ తెలిపారు.జిల్లాలో బోన్ మ్యారో కేసులకు చికిత్స అందిస్తున్నందుకు, మదర్ మిల్క్ బ్యాంకును సమర్థవంతంగా నిర్వహిస్తున్నందుకు ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి ఎంపీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విశ్రాంతి భవనానికి ఫర్నిచర్ అందించిన ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులకు, రెండు టీవీలు అందించిన దయాగ్నస్టిక్ సెంటర్ల నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, సూపరింటెండెంట్ డా. మల్లేశ్వరి, ఆర్ఎంవోలు డా. సుధారాణి, డా. హేమలత, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. విజయశ్రీ, డీఎంహెచ్ఓ డా. వెంకటేశ్వర్లు, హాస్పిటల్ కమిటీ సభ్యులు నరసింహులు, రత్నమయ్య, క్యాటరింగ్ రమ్మన, వివిధ విభాగాల వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 2న 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్ -- రాయలసీమ రైజింగ్' ప్రారంభం...!

- రాయలసీమను ఉద్యానవన రంగంలో కీలక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ఉద్యాన పంటలతో రైతులకు మెరుగైన ఆదాయ అవకాశాలు
- రూ.లక్ష కోట్ల వరకు పెట్టుబడుల లక్ష్యం కలెక్టర్ ఓ ఆనంద్



**అనంతపురం కలెక్టరేట్- సూర్య వాస్తవం :** రాయలసీమ ప్రాంతాన్ని ఉద్యానవన రంగంలో కీలక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో అక్టోబర్ 2వ తేదీన "గ్లోబల్ హార్టికల్చర్ హబ్ -- రాయలసీమ రైజింగ్" కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రెస్‌మీట్ నిర్వహించి కార్యక్రమానికి సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు.ఆంధ్రప్రదేశ్‌లోని 10 జిల్లాలను గ్లోబల్ హార్టికల్చర్ హబ్ అభివృద్ధి కార్యక్రమానికి ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందులో అనంతపురం జిల్లా కూడా ఉన్నట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో ఉద్యానవన రంగంలో భారీగా పెట్టుబడులు తీసుకురావడంతో పాటు ఉద్యాన పంటల సాగు, ఉత్పత్తి, మార్కెటింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమం ద్వారా మొత్తం సుమారు రూ.లక్ష కోట్ల వరకు పెట్టుబడులు సమీకరించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సుమారు రూ.60 వేల కోట్లు, ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా మరో రూ.40 వేల కోట్ల పెట్టుబడులు సమీకరించే విధంగా ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొన్నారు. ఉద్యాన పంటల విస్తరణతో రైతులకు మెరుగైన ఆదాయ అవకాశాలు కల్పించడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం, పంటలకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు కలెక్టర్ వివరించారు.రాయలసీమలోని వాతావరణ పరిస్థితులు, భూమి స్వభావం, ఉద్యాన పంటలకు ఉన్న అనుకూలతలను వినియోగించుకుని ఈ ప్రాంతాన్ని అంతర్జాతీయ స్థాయి ఉద్యానవన హబ్‌గా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.




## ఖమ్మంలో 28 నుంచి అఖిల భారత రైతు కూలీ సంఘం... నాలుగో జాతీయ మహాసభలు...!

- ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో వాల్ పోస్టర్ల ఆవిష్కరణ
- రైతులు, కార్మికులు, మేధావులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి

**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** అఖిల భారత రైతు కూలీ సంఘం నాలుగో జాతీయ మహాసభలను ఈ నెల 28, 29, 30 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఐఎఫ్‌టీయూ పార్టీ కార్యాలయంలో జాతీయ మహాసభల వాల్ పోస్టర్లను విడుదల చేశారు.రైతులు, కార్మికులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని నాయకులు ఆరోపించారు. గతంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు 13 నెలల పాటు ఉద్యమం నిర్వహించారని గుర్తుచేశారు. రైతులకు భారంగా మారే విధానాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని, కరువు ప్రభావిత ప్రాంతాల్లో తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. అన్ని పంటలకు పంటల బీమా పరిహారం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కరువు నివారణ చర్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రైతులు, కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఈశ్వరయ్య, నాగభూషణం, మధు, అనిల్ తదితరులు పాల్గొని పోస్టర్లను విడుదల చేశారు.

## రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్... రాష్ట్ర కోశాధికారిగా ఆర్ఎన్ దివాకర్ రావు...!

- దివాకరరావు ఎన్నికతో ఉద్యోగుల్లో హర్షం
- ఘనంగా సన్మానించిన జిల్లా రెవెన్యూ ఉద్యోగులు
- రాష్ట్ర స్థాయిలో అనంతపురం రెవెన్యూ ఉద్యోగులకు దక్కిన కీలక ప్రాతినిధ్యం
- దివాకరరావు ఎన్నిక జిల్లా ఉద్యోగులకు గర్వకారణం

**అనంతపురం రెవెన్యూ - సూర్య వాస్తవం :** రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నికల్లో అనంతపురం జిల్లా అధ్యక్షులు ఆర్.ఎన్. దివాకరరావు రాష్ట్ర కోశాధికారిగా ఎన్నికైన సందర్భంగా జిల్లా రెవెన్యూ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సెప్టెంబర్ 25న రాత్రి అనంతపురం రెవెన్యూ హోమ్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు.అనంతపురం జిల్లా రెవెన్యూ ఉద్యోగులకు రాష్ట్ర స్థాయిలో ప్రాతినిధ్యం కల్పిస్తూ కీలక బాధ్యతలు అప్పగించినందుకు బొప్పరాజు వెంకటేశ్వర్లు, సీహెచ్. కృష్ణమూర్తికి ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర కోశాధికారిగా దివాకరరావు ఎన్నిక కావడం జిల్లా రెవెన్యూ ఉద్యోగులకు గర్వకారణమని, ఉద్యోగుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం ఆయన మరింత సమర్థవంతంగా పనిచేస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ జి. సోమశేఖర్, ట్రెజరర్ వి. పూనీత్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి. ప్రసాద్, ఉపాధ్యక్షులు ముక్తియర్, మోహన్‌కుమార్, జాయింట్ సెక్రటరీ జి. చంద్‌బాషా, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ తిప్పిస్వామి, ఈసీ సభ్యులు ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.అలాగే రెవెన్యూ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్, రెవెన్యూ క్రెడిట్ సొసైటీ, కలెక్టరేట్ యూనిట్, అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు డివిజన్లకు చెందిన ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, సీనియర్ కామ్రేడ్స్, ఏపీజేఏసీ అమరావతి ప్రతినిధులు, వీఆర్ఓ, వీఆర్ఏ అసోసియేషన్ నాయకులు, పలువురు రెవెన్యూ ఉద్యోగులు పాల్గొని దివాకరరావుకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు



## “అంగన్ కా ఉత్సవ్”కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్య కుమార్ యాదవ్



**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:** ధర్మవరంలో నిర్వహించిన“అంగన్ కా ఉత్సవ్” కార్యక్రమంలో శనివారం,రాష్ట్ర వైద్య,ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు,ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్లు,హెల్పర్లు,ఆశా వర్కర్లను శాలువాలతో సన్మానించి,వారి నిస్వార్థ సేవలను అభినందించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,దేశవ్యాప్తంగా 14 లక్షల అంగన్వాడీ కేంద్రాల ద్వారా సుమారు 9 కోట్ల మంది లబ్ధిదారులకు సేవలు అందుతున్నాయని మంత్రి గారు తెలిపారు.అంగన్వాడీ కేంద్రాలు పౌష్టికాహారంతో పాటు పిల్లల ప్రాథమిక విద్య, ఆరోగ్యం,పోషణ,ఎదుగుదల మరియు తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా సుమారు 1.5 లక్షల సక్షం అంగన్వాడీ కేంద్రాలుగా అభివృద్ధి జరుగుతోందని, అంగన్వాడీ సేవలను బలోపేతం చేసేందుకు సుమారు రూ.22,000 కోట్ల బడ్జెట్ కేటాయింపు ఉందని మంత్రి వివరించారు,సేవా సంకల్ప అభియాన్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా అంగన్వాడీ,ఆశా కార్యకర్తల సేవలను సమాజానికి పరిచయం చేసి,వారికి మరింత గౌరవం కల్పించడమే లక్ష్యమని మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు.

## అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవం



**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రతి అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ మహ్ అనే కార్యక్రమం ద్వారా పోషకాహార మాస్ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.ఈ క్రమంలో భాగంగా సూపర్వైజర్ అంకమ్మ దొరవారిసత్రం మండల పరిధిలోని కుప్పారెడ్డిపాలెం,నెలబల్లి అంగన్వాడీ కేంద్రంలో శనివారం పోషకాహార మాసోత్సవంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యమే– మహాభాగ్యం అన్న సామెత నిజం కావాలంటే ప్రతి ఒక్కరికి దినసరి ఆహారంలో అందాల్సిన సమ పోషక పదార్థాలు ఆహారంగా తీసుకోవాలని సూచించారు.ప్రధానంగా గర్భవతి, బాలింతలు ఆరోగ్యకరంగా ఉండాలంటే సమతుల్య ఆహారం తీసుకోవాలని తెలిపారు.అదేవిధంగా ఆరేళ్లలో పిల్లలు కూడా ఆరోగ్యంతో పాటు,శారీరక ఎదుగుదల,మానసిక పరిపాక్వత రావాలంటే పోషకాహారాన్ని వారికి అందించాలని పేర్కొన్నారు. రక్తహీనత నివారణకు ఐరన్ కలిగిన ఆకుకూరలను అధికంగా తీసుకోవాలని చెప్పారు.బాలల వికాసం, సమాజ భాగస్వామ్యం,అనే అంశాలపై చర్చించారు. చిన్నారులు చిన్ననాటి నుండి ఆట వస్తువులతో అవగాహనతో కూడిన విద్య అలవర్చడానికి అవగాహన కల్పించాలి తప్ప,సెల్ ఫోన్ లు,టీవీలకు చిన్ననాటి నుండి బానిసత్వం కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ అంకమ్మ,అంగన్వాడి కార్యకర్తలు, ప్రేమాంజలి,నిర్మలమ్మ,గర్భవతులు,కిశోర బాలికలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

## యువతకు దేశసేవలో అవకాశాలు--ఉచిత శిక్షణకు శ్రీకారం





**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:** ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో, శనివారం రాష్ట్ర వైద్య,ఆరోగ్య,కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు,ధర్మవరం ఎమ్మెల్యే సత్య కుమార్ యాదవ్ ఆర్మీ,పోలీస్,పారా మిలిటరీ ఉద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణకు సంబంధించిన పోస్టర్ను విడుదల చేశారు.సంస్కృతి సేవా సమితి -- ధర్మవరం మరియు ఎస్వి డిఫెన్స్ అకాడమీ -- తిరుపతి ఆధ్వర్యంలో ఈ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.గతంలో ఈ సంస్థ ద్వారా అనేక మంది యువతకు ఆర్మీ,పోలీస్,పారా మిలిటరీ రంగాల్లో అవకాశాలు లభించగా,ఇటీవల 236 మంది అగ్నివీర్ అభ్యర్థులు హాజరైన పరీక్ష/ఎంపిక ప్రక్రియలో 220 మంది ఎంపిక కావడం విశేషమని పేర్కొన్నారు.ధర్మవరం యువతలో దేశసేవ,దేశ రక్షణ పట్ల ఆసక్తిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం 100 మంది యువతను ఎంపిక చేసి ఉచిత శిక్షణ అందించేలా ఎస్వి డిఫెన్స్ అకాడమీతో అనుసంధానం చేసినట్లు మంత్రి సత్య కుమార్ తెలిపారు.భారత మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త డా. ఏ.పి.జె.అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ధర్మవరంలో ఉచిత ఎంపిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఆసక్తి,అర్హత కలిగిన యువత అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని,దేశ రక్షణలో భాగస్వాములు కావాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు.వివరాల కోసం:మల్లిఖార్జున -- 7998256789 నరేంద్ర -- 9490442576 లను సంప్రదించండి.

# ధర్మవరం చెరువు అభివృద్ధి--సుందరీకరణపై సమీక్ష



**దొరవారిసత్రం– సూర్య వాస్తవం:** ధర్మవరం ఎమ్మెల్యే,రాష్ట్ర వైద్య,ఆరోగ్య,కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు సత్య కుమార్ ఆధ్వర్యంలో శనివారం ధర్మవరంలోని ఎన్డీఏ కార్యాలయంలో స్కూల్ అఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (ఎస్ పి ఎ),విజయవాడ బృందంతో కలిసి ధర్మవరం చెరువు అభివృద్ధి, సుందరీకరణ ప్రణాళికపై సమీక్ష నిర్వహించాము. సుమారు 16 కి.మీ.మేర విస్తరించి ఉన్న చెరువు పరిధి,అలాగే ప్రతిపాదిత 7 స్ట్రెచ్లు,వాటికి అనుగుణంగా రూపొందించనున్న థీమ్స్ను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి ప్రణాళికపై చర్చించాము.ఈ అభివృద్ధి ప్రాజెక్టుకు సుమారు రూ.100 కోట్ల వరకు వ్యయం అయ్యే అవకాశం ఉందని అంచనా.చెరువు పరిసరాల్లో భద్రత, నీటి నాణ్యత,పచ్చదనం, ప్రజలకు అందుబాటు వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలు, కుటుంబాలు, పిల్లలు ఆహ్లాదంగా గడిపేలా వాకింగ్ ట్రాక్,సైక్లింగ్ ట్రాక్ , గ్రీన్ బఫర్,సీటింగ్ ఏరియాస్,వీయింగ్ డెక్స్ చిల్డ్రన్ ఎస్ ప్లే ఏరియాస్ వంటి సదుపాయాలను అభివృద్ధి చేయడంపై సమీక్ష జరిగింది.7 స్ట్రెచ్లకు ప్రత్యేకమైన థీమ్స్ను రూపొందించి,చెరువు పరిసరాలను విభిన్న అనుభవాలతో కూడిన ప్రజా ప్రదేశంగా తీర్చిదిద్దే అంశాలను పరిశీలించాము.పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ బయోశ్వలే వెట్లాండ్ ప్లాంటింగ్ , నేటివ్ ట్రీస్ ద్వారా నీటి వడపోత,పచ్చదనం, జీవవైవిధ్యాన్ని పెంపొందించే అంశాలను పరిశీలించాము.అలాగే వాటర్ /అరేటింగ్ ఫౌంటైన్స్ ద్వారా నీటిలో ఆక్సిజన్ స్థాయిని మెరుగుపరచడం, నీటి నాణ్యతకు తోడ్పడటంతో పాటు చెరువు అందాన్ని పెంచే అంశాలపై చర్చించాము. ధర్మవరం చెరువును సురక్షితమైన,పర్యావరణహితమైన, ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే ప్రాంతంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ నేతృత్వంలో ముందుకు సాగుతుంది.



# జీవ వైవిధ్య సజీవ వారసత్వాన్ని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత...

- నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ మెంబర్ చెరుకూరి వెంకటేశ్వర ప్రసాద్
- ఎస్వీయూలో జీవ వైవిధ్యంపై వారం రోజుల పాటు కార్యక్రమాలు ప్రారంభం




**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:** దేశంలో నెలకొన్న జీవవైవిధ్య సజీవ వారసత్వాన్ని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జాతీయ జీవ వైవిధ్య ప్రాధికార సంస్థ సభ్యులు చెరుకూరి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు.శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం,విద్యార్థి సంక్షేమ మరియు సాంస్కృతిక వ్యవహారాల విభాగం ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని”శేషాచలం–జీవ వైవిధ్య సజీవ వారసత్వం”అనే అంశంపై వారం రోజుల అవగాహన, సృజనాత్మక కార్యక్రమాలు ఎస్వీయూ సెనేట్ హాల్లో శనివారం ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ జీవ వైవిధ్య ప్రాధికార సంస్థ సభ్యుల చెరుకూరి వెంకటేశ్వర ప్రసాద్, ఉపకులపతి ఆచార్య టి.నర్సింగరావు, కులసచివులు ఆచార్య ఎం.భూపతి నాయుడు, రెక్టార్ ఆచార్య చంద్రాయుడు హాజరయ్యారు.ఈ సందర్భంగా చెరుకూరి వెంకటేశ్వర ప్రసాద్, మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధిలో అన్ని డిగ్రీ కళాశాలలు,వర్సిటీ కళాశాలలో విద్యార్థులకు,పరిశోధకులకు,అధ్యాపకులకు జీవవైవిధ్యం,సంస్కృతి,సాంప్రదాయాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను విద్యార్థి కల్చరల్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించడం శుభ పరిణామం అన్నారు.విద్యార్థులు జీవవైవిధ్యంపై ప్రత్యేకమైన అవగాహనతో వాటిని సంరక్షించేందుకు తమ వంతు ప్రయత్నం చేయాలని పిలుపునిచ్చారు. ఆచార్య ఎం.భూపతి నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు అడవుల సంరక్షణ వలన కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకొని,జీవవైవిధ్య రంగం ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు.మొక్కలను నాటుతూ,సంరక్షిస్తూ అటవి సంపద పెంచడం ద్వారా వర్షాలు పుష్కలంగా కురిసి ప్రజలకు ఎలాంటి సహజ వనరుల కొరత లేకుండా పోతుందన్నారు. సమాజంలో నివసించే ప్రతి ఒక్కరూ ముఖ్యంగా విద్యార్థులు సమావేశంలో భాగంగా మొక్కలను నాటుతూ వాటిని సంరక్షించవలసిన బాధ్యత కూడా స్వీకరించాలని సూచించారు. డిఎస్డబ్ల్యుసిఏ డైరెక్టర్ ఆచార్య బివి.మురళీధర్ మాట్లాడుతూ విద్యార్థులకు జీవవైవిధ్యం,వన్య ప్రాణాల సంరక్షణ విధానం,వాటి ఆవశ్యకత గురించి వారం రోజులపాటు అవగాహన కార్యక్రమాలను ఎస్వీయూ సెనేట్ హాల్,శ్రీనివాస ఆడిటోరియం,అన్నమయ్య భవనంలలో డిగ్రీ కళాశాల,వర్సిటీ కళాశాల విద్యార్థులకు నిర్వహిస్తున్నామన్నారు. డిఎస్డబ్ల్యుసిఏ అసిస్టెంట్ డైరెక్టర్, కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు సంస్కృతి, సాంప్రదాయాలు, కలలు, సాహిత్యం వంటి రంగాలలో పాటు జీవవైవిధ్య సదస్సు నిర్వహించడం ద్వారా వారిలో ప్రత్యేకమైన అవగాహన ఏర్పరిచేందుకు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.అనంతరం నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ మెంబర్ చెరుకూరి వెంకటేశ్వర ప్రసాద్ ను పలువురు శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.




## ఆంధ్రప్రదేశ్--తమిళనాడు

# మత్స్యకారుల సమస్యలపై ఉన్నత స్థాయి సమావేశం

- ”ఫ్రీ జోన్” ఏర్పాటు చేయాలని ప్రతినిధుల వినతి



**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:** తమిళనాడులోని గుమ్మిడిపూడి ఎండీఓ కార్యాలయంలో శనివారం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు,మత్స్యకార సంఘాల ప్రతినిధులతో ద్వైపాక్షిక సమావేశం జరిగింది.సరిహద్దు ప్రాంతాల్లో రెండు రాష్ట్రాల మత్స్యకారులు ఎదుర్కొంటున్న వేట సంబంధిత సమస్యలు,ఎదురవుతున్న ఇబ్బందులు, వాటి శాశ్వత పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు.?ఈ కార్యక్రమం లో పొన్నేరి శాసనసభ నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ ఎమ్.ఎస్.రవి,సూళ్ళూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ,తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎస్.కవిత (ఐఏఎస్)తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు (ఐఏఎస్) పాల్గొన్నారు.వీరితో పాటు తిరుపతి అదనపు ఎస్పీ రవిమనోహరాచారి,సూళ్లూరుపేట ఆర్డీఓ దేవేంద్రరెడ్డి,నాయుడుపేట డీఎస్పీ జీ.చెంచుబాబు, సూళ్లూరుపేట సీఐ ఎం.మురళీకృష్ణ,తడ ఎస్సై కొండప్ప నాయుడు, రెండు రాష్ట్రాల రెవెన్యూ,పోలీసు,మత్స్యశాఖ అధికారులు హాజరయ్యారు.సమావేశంలోఆంధ్రప్రదేశ్–తమిళనాడు మత్స్యకార అసోసియేషన్ నాయకులు, తమిళనాడు మత్స్యకారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ముఖ్యంగా సరిహద్దు జలాల్లో వేట సాగించేటప్పుడు ఇరు ప్రాంతాల మత్స్యకారుల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయని తెలిపారు.ఈ సమస్యకు పరిష్కారంగా రెండు రాష్ట్రాల సముద్ర,సరస్సు సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించాలని (బౌండరీ ఫిక్స్ చేయాలని) కోరారు. అలాగే మత్స్యకారుల జీవనోపాధి, ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సరిహద్దుల్లో ప్రత్యేకంగా “ఫ్రీ జోన్”ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మత్స్యకార సంఘాల ప్రతినిధులు ప్రస్తావించిన వినతులపై అధికారులు సానుకూలంగా స్పందించారు.ఈ అంశాలను రెండు రాష్ట్రాల ప్రభుత్వాల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరలోనే చట్టబద్ధమైన పరిష్కారం చూపేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో మత్స్యకారుల మధ్య ఎలాంటి ఘర్షణలు జరగకుండా రెండు రాష్ట్రాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తామని, నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



## మా సినిమా టాక్ రివర్స్‌లో ఉంది

# 'ప్యారడైజ్' విజయంపై నాని

నేచురల్ స్టార్ నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వచ్చిన 'ది ప్యారడైజ్' చిత్రంపై ప్రేక్షకులనుంచి వస్తున్న స్పందన చాలా కొత్తగా ఉందని నాని అన్నారు. శనివారం జరిగిన చిత్ర యూనిట్ ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ, సాధారణంగా ఉదయం పాజిటివ్ టాక్‌తో మొదలై సాయంత్రానికి మిశ్రమ స్పందన వచ్చే సినిమాలకు భిన్నంగా, తమ సినిమాకు షో షోకి ఆదరణ పెరుగుతోందని చెప్పారు. తమ చిత్రానికి అన్ని చిత్రాలకంటే రివర్స్‌గా మిక్స్ టాక్ వచ్చి, ఆ తర్వాత పాజిటివ్ టాక్ వచ్చిందని అన్నారు."ఈ సినిమా విషయంలో నాకు ప్రతిదీ కొత్తగానే అనిపించింది. మేం ఈ సినిమాను రూపొందించిన విధానం, చిత్రీకరణ జరిపిన ప్రదేశాల్లోని పరిస్థితులు, ట్రైలర్ లేకుండానే సినిమాను విడుదల చేయడం, రిలీజ్‌కు ముందు నెలకొన్న ఉత్కంఠ... ఇలా అన్నీ మాకు కొత్త అనుభవాలే. ఒక సరికొత్త సినిమా చేస్తున్నామని, ప్రేక్షకులకు ఒక వినూత్నమైన అనుభూతిని అందిస్తున్నామని బలంగా నమ్మాం. అయితే, ప్రేక్షకుల నుంచి స్పందన కూడా ఇంత కొత్తగా, ఇంత అద్భుతంగా ఉంటుందని మేము ఊహించలేదు. ఇది నాకు వ్యక్తిగతంగా ఎప్పటికీ గుర్తుండిపోయే ఒక ప్రత్యేకమైన అనుభవం.నేను ఇండస్ట్రీకి వచ్చి ఎన్నో సినిమాలు చేశాను. ఈ మధ్యకాలంలో నేను గమనిస్తున్నదేమిటంటే, సినిమాలు విడుదలైన రోజు ఉదయం చాలా పాజిటివ్ స్పందనతో మొదలవుతాయి. కానీ, సాయంత్రానికి వచ్చేసరికి ఆ టాక్ కాస్తా మిక్స్‌డ్‌గా మారిపోతుంది.

మా 'ప్యారడైజ్' సినిమా విషయంలో దీనికి పూర్తి భిన్నంగా జరిగింది. విడుదల రోజున ప్రీమియర్ షోలతో ఒకరకమైన స్పందనతో మొదలై, ఆ తర్వాత ప్రదర్శించే ప్రతి షోతో పాజిటివిటీ పెరుగుతూ వచ్చింది. ప్రేక్షకుల నుంచి ఆదరణ అంతకంతకూ మెరుగవుతూ వచ్చింది. ఈ మధ్య కాలంలో ఒక సినిమాకు ఇలాంటి అద్భుతమైన స్పందన రావడం నేను చూడలేదు.మేమందరం చాలా నిబద్ధతతో, అంకితభావంతో ఈ సినిమా చేశాం. ప్రారంభంలో రకరకాల స్పందనలు వచ్చినప్పుడు వాటన్నిటినీ స్వీకరించాం. ఇప్పుడు ప్రేక్షకులు ఇంతగా ప్రేమను కురిపిస్తున్నప్పుడు, ఆ ఆదరణను, వారి ప్రేమను అంతే గౌరవంగా స్వీకరించాల్సిన సమయం వచ్చింది. ప్రతి ఒక్కరూ ఈ సినిమాను తమ సొంత సినిమాగా భావించి, అందులోని చిన్నచిన్న సందర్భాలను కూడా ఆస్వాదిస్తూ, వాటిని సెలబ్రేట్ చేసుకుంటుంటే మాకు చాలా సంతోషంగా అనిపించింది. తెలుగు ప్రేక్షకుల రుణం నేను ఎప్పటికీ తీర్చుకోలేను. వారు తమ అభిప్రాయాలను చాలా నిజాయితీగా, నిర్మొహమాటంగా చెబుతారు. అలాంటి గొప్ప ప్రేక్షకులు ఉన్నంతకాలం తెలుగు సినిమా ఉన్నత స్థాయిలో ఉంటుంది.మా చిత్ర బృందంలోని ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

'ప్యారడైజ్' ఒక హీరో సినిమా కాదు. ఈ సినిమా కోసం కేవలం హీరోనే ఎక్కువగా కష్టపడ్డాడని ఎవరూ చెప్పలేరు. ఎందుకంటే, ఈ చిత్రంలో చిన్న పాత్రలు పోషించిన వారి నుంచి ప్రతి ఒక్కరూ ఎంత కష్టపడ్డారో నేను దగ్గరుండి చూశాను. వర్షంలో తడుస్తూ రోజుల తరబడి ఈ సినిమాను నమ్మి పనిచేశారు. మీరందరూ 'ప్యారడైజ్' చిత్రానికి నిజమైన హీరోలు. ప్రతి పాత్రధారి, ప్రతి కళాకారుడు, ప్రతి సాంకేతిక నిపుణుడు, ప్రతి అసిస్టెంట్ డైరెక్టర్... అందరూ నిద్రలేని రాత్రులు గడిపి పనిచేశారు. మీ కష్టానికి నా




హ్యాట్సాఫ్.అనిరుధ్ అద్భుతమైన సంగీతం అందించాడు. అతను ఇచ్చిన సంగీతం వల్లే తెలుగు రాష్ట్రాల్లోని ప్రేక్షకులు థియేటర్లకు తరలివచ్చారు. సాయి ఈ సినిమాకి ఎంతో సమయం కేటాయించి కష్టపడ్డాడు. ఈ సినిమాను చిత్రీకరించడం అంత సులభం కాదు. అవినాష్ గారు ఎంతో శ్రమించి అద్భుతమైన సెట్స్ వేశారు. అలాగే ఎడిటర్ నవీన్ కూడా చాలా హార్డ్‌వర్క్ చేశాడు. సంపూ ఒక బ్యూటిఫుల్ హ్యూమన్ బీయింగ్, చాలా మంచివాడు. సవారి గ్యాంగ్‌లో నటించిన వాళ్లందరూ అద్భుతంగా చేశారు. మా స్టంట్, డాన్స్ కొరియోగ్రాఫర్లు కూడా అద్భుతంగా పనిచేశారు. ఈ సినిమాలోని భావోద్వేగాన్ని కాసర్ల శ్యామ్ గారు తన సాహిత్యంలో అద్భుతంగా పలికించారు. సుధాకర్ గారిని మేము చాలా ఇబ్బంది పెట్టాం. కానీ, ఆయన మా అందరినీ బలంగా నమ్మారు. షూటింగ్ సమయంలో ఎదురైన ఎన్నో సమస్యలకు ఆయన అండగా నిలబడ్డారు. ఆయన ఫిల్మోగ్రఫీలో 'ప్యారడైజ్' ఒక ప్రత్యేక చిత్రంగా నిలిచిపోతుంది.ప్రియదర్శి చేసిన శంకరన్న పాత్రకు అద్భుతమైన స్పందన వస్తోంది. ప్రియదర్శి ఒక టెర్రిఫిక్ పెర్ఫార్మర్. కయాదు లోహర్ పోషించిన 'సుబ్బు' లాంటి పాత్ర చేయడం చాలా కష్టం, కానీ తను అద్భుతంగా చేసింది. ఇక మా అందరి ఫేవరెట్ మోహన్ బాబు గారు. నాకు చిన్నప్పటి నుంచి ఆయన నటన అంటే ఎంతో ఇష్టం. 'అసెంబ్లీ రౌడీ', 'పెదరాయుడు' నా ఫేవరెట్ సినిమాలు. ఆయనతో కలిసి పనిచేసిన తర్వాతే ఆయన ఎంత గొప్ప వ్యక్తి అనేది నాకు అర్థమైంది. ఆయనతో దగ్గరగా పనిచేస్తే ఎవరైనా ఆయనతో ప్రేమలో పడిపోతారు. ఈ సినిమాకు హీరో పైన ఉన్న హీరో ఆయనే. దర్శకుడు శ్రీకాంత్ ఒక ఒరిజినల్ పీస్, అతని గురించి మాటల్లో చెప్పలేను.ఈ సినిమా విడుదల తర్వాత వచ్చిన స్పందన ఒక తుపానులా ఉంది. ఎక్కడికి వెళ్లినా, ఎవరిని కలిసినా ఒకటే టాపిక్... 'ప్యారడైజ్' విజయం. 2026లో అత్యధికంగా వినిపించిన సినిమా 'ప్యారడైజ్'. ఈ విజయాన్ని మాకు అందించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా నా హృదయపూర్వక ధన్యవాదాలు" అంటూ నాని తన స్పీచ్ ముగించారు.ఈ కార్యక్రమంలో నటులు ప్రియదర్శి, సంపూర్ణేశ్ బాబు కూడా పాల్గొని తమ పాత్రలకు వస్తున్న స్పందన పట్ల సంతోషం వ్యక్తం చేశారు.



## ఫ్లాపులు తట్టుకోలేక పరేషాన్ అవుతున్న బ్యూటీలు!

వెండితెరపై కథానాయిక అందంగా ఉండాలి .. ఆకర్షణీయంగా అనిపించాలి. దిష్టి చుక్క పెట్టని చందమామలా కనిపించాలి. లేదంటే ఆడి యన్స్ నిరాశపడిపోతారు .. నిరుత్సా హానికి లోనవుతారు. తెరపై సమాజసేవలో అలసి పోయిన నాయకుడికి .. ఆ నాయకుడికి విజిల్స్ కొట్టి విసిగి పోయిన ఆడియన్స్ కి కాస్త ఉపశమనాన్ని కలిగించేది హీరోయిన్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. అలాంటి హీరోయిన్ అందంగా ఉండాలని అను కోవడంలోను తప్పులేదు. అభిమానుల మనసు దోచుకుంటూ .. అవకాశాలను అందుకుంటూ .. విజయాలను సొంతం చేసుకోవడం అంత తేలికైన విషయమేం కాదు. ఇక్కడ హిట్టు తప్ప వాళ్లను కాపాడే మరో మంత్రమే లేదు. ఒకప్పుడు హీరోయిన్స్ ఏళ్లతరబడి ఏలుతూ వెళ్లారు. కానీ ఇప్పుడు ట్రెండ్ మారిపోయింది. ఎంత గ్లామరస్ గా ఉన్నప్పటికీ .. ఎంత టాలెంట్ ఉన్నప్పటికీ రెండు మూడు ఫ్లాపులు పడితే అంతే సంగతులు. మేకప్ కిట్ సర్దుకుని మరో ఇండస్ట్రీకి వెళ్లడం తప్ప మరో మార్గం లేదు. కృతి శెట్టి ఇచ్చిన ఎంట్రీ మామూలుగా లేదు. ఫస్టు మూవీతోనే 100 కోట్ల బ్యూటీగా మార్కులు కొట్టేసింది. అరుదైన ఫీట్ గా చెప్పుకునే హ్యాట్రిక్ హిట్ ను దక్కించుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇక కుదురుకున్నట్టే అనుకునేంతలోనే పరాజయాల పలకరింపు మొదలైంది. అప్పటి నుంచి కృతి శెట్టి ఇక్కడ కనిపించలేదు. ఆ సమయంలో వరుస విజయాలతో చెలరేగిపోయిన శ్రీలీలకి కూడా ఆ తరువాత ఫ్లాపులు తప్పలేదు. ఆమె జోరు తగ్గడానికి కూడా ఎక్కువ సమయం పట్టలేదు.ఈ నేపథ్యంలోనే విశాలమైన కళ్లతో విన్యాసాలు చేసుకుంటూ భాగ్యశ్రీ బోర్సే తెరపైకి వచ్చింది. అమ్మాయి గ్లామర్ కి వంకబెట్టవలసిన అవసరం లేదని ఆడియన్స్ అనుకున్నారు. కుర్రాళ్లంతా కూడబలుక్కుని ఆమె అభిమానుల జాబితాలో చేరిపోయారు. కానీ సక్సెస్ అనేక విధాలుగా ఆమెతో దోబూచులాడుతూనే వచ్చింది. దాంతో ఆమె కూడా ఇతర భాషా చిత్రాల వైపు అడుగులు వేయవలసి వచ్చింది. ఎంత అందంగా ఉన్నా .. టాలెంట్ ఉన్నా కొంత కాలం కూడా నిలదొక్కుకోలేక పోతుండటం నిజంగా విచారించదగిన విషయమే.



## ఆసియా క్రీడలు: కబడ్డీలో భారత్ డబుల్ గోల్డ్..

# ఇరాన్‌ను ఓడించి పురుషుల జట్టు స్వర్ణం కైవసం

ఆసియా క్రీడల్లో భారత కబడ్డీ జట్లు స్వర్ణ పతకాలతో మెరిశాయి. నేడు జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్స్‌లో పురుషుల, మహిళల జట్లు రెండూ ఇరాన్‌ను ఓడించి తమ టైటిళ్లను విజయవంతంగా నిలబెట్టుకున్నాయి. దీంతో భారత కబడ్డీ ఒకే రోజు రెండు స్వర్ణాలను ఖాతాలో వేసుకుని సంబరాలు చేసుకుంది.పురుషుల ఫైనల్ ఆద్యంతం హోరాహోరీగా సాగింది. భారత జట్టు 40-34 తేడాతో ఇరాన్‌పై విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఒక దశలో ఇరు జట్ల స్కోర్లు 20-20తో సమంగా నిలిచాయంటే పోరు ఎంత తీవ్రంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు. అయితే, కీలక సమయంలో పుంజుకున్న భారత క్రీడాకారులు ఇరాన్‌పై పైచేయి సాధించి విజయాన్ని అందుకున్నారు. వరుసగా ఏడుసార్లు స్వర్ణాలు గెలిచిన భారత పురుషుల జట్టు, 2018 జకార్తా గేమ్స్‌లో ఇరాన్ చేతిలో ఓడి నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. అయితే, ఆ తర్వాత పుంజుకుని 2023లో టైటిల్ గెలిచి, ఇప్పుడు దాన్ని నిలబెట్టుకుని మరోసారి తమ ఆధిపత్యాన్ని నిరూపించుకుంది.అంతకుముందు జరిగిన మహిళల ఫైనల్‌లో కూడా భారత జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఇరాన్‌పై 37-34 తేడాతో గెలిచి స్వర్ణం కైవసం చేసుకుంది. దీంతో రెండు విభాగాల్లోనూ ఇరాన్‌ను ఓడించి భారత్ డబుల్ గోల్డ్ సాధించినట్టయింది.



### చివరి నిమిషాల్లో ట్విస్ట్.. భారత్‌కు స్వర్ణం!

నాగోయాలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత మహిళల కబడ్డీ జట్టు మరోసారి సత్తా చాటింది. శనివారం జరిగిన ఫైనల్లో ఇరాన్‌తో హోరాహోరీగా తలపడిన భారత జట్టు 37-34 తేడాతో విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఆట ప్రారంభం నుంచే భారత్ ఆధిపత్యం ప్రదర్శించింది. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి 22-16 ఆధిక్యంలో నిలిచింది. అయితే విరామం తర్వాత ఇరాన్ ఒక్కసారిగా పుంజుకోవడంతో మ్యాచ్ మరింత ఉత్కంఠగా మారింది. ఒక దశలో ఆధిక్యం కూడా ప్రమాదంలో పడినప్పటికీ.. కీలక సమయంలో భారత కబడ్డీ జట్టు పుంజుకుని విజయాన్ని ఖాయం చేశారు.చివరి విజిల్ మోగగానే భారత శిబిరంలో సంబరాలు అంబరాన్ని తాకాయి. ఆటగాళ్లు స్టేడియంలో విజయయాత్ర చేస్తూ 'వందే మాతరం' ఆలపించారు. మరోసారి ఆసియా వేదికపై భారత మహిళల కబడ్డీ జట్టు స్వర్ణంతో మెరిసింది. ఈ విజయం భారత మహిళల కబడ్డీ జట్టు ఆసియా క్రీడల్లో తమ బలమైన రికార్డును కొనసాగించిన మరో ఘట్టంగా నిలిచింది. 2026 ఆసియా క్రీడల్లో మహిళల కబడ్డీ ఫైనల్‌కు ముందు భారత్ వరుస విజయాలతో ముందుకు సాగింది.






## ఫోకస్ అంతా రో-కో పైనే.. 51 పరుగులు చేస్తే కోహ్లీ చరిత్ర!

టీమిండియా స్వదేశీ సీజన్‌కు సిద్ధమైంది. వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ ఆదివారం జరగనుంది. తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం ఈ పోరుకు వేదిక కానుంది. ఈ మ్యాచ్‌లో అందరి చూపు సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీపైనే ఉంది. వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్‌కు భారత్ ఇప్పటి నుంచే సన్నద్ధమవుతోంది. అయితే గాయాలు, ఆసియా క్రీడల కారణంగా పలువురు కీలక ఆటగాళ్లు జట్టుకు దూరమయ్యారు. దీంతో అందుబాటులో ఉన్న ఆటగాళ్లతో జట్టు కూర్పు ఎలా ఉంటుందన్నది ఆసక్తిగా మారింది.ఇటీవల ఇంగ్లాండ్‌తో లార్డ్స్‌లో జరిగిన మ్యాచ్‌లో రోహిత్ 138 పరుగులతో అదరగొట్టాడు. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత 15 ఇన్నింగ్స్‌ల్లో రెండు సెంచరీలు చేశాడు. అయితే ఎనిమిది సార్లు 30లోపే ఔటయ్యాడు. పవర్‌ప్లేలో అతడి బ్యాటింగ్ వేగంపైనా చర్చ జరుగుతోంది.మరోవైపు విరాట్ కోహ్లీ అరుదైన మైలురాయికి చేరువలో ఉన్నాడు. వన్డేల్లో 15 వేల పరుగులు పూర్తి చేసేందుకు అతడికి 51 పరుగులు మాత్రమే కావాలి. ఈ ఘనత సాధిస్తే సచిన్ తర్వాత ఆ మార్క్‌ను అందుకున్న రెండో ఆటగాడిగా నిలుస్తాడు. గత 12 వన్డేల్లో ఎనిమిది సార్లు 50కిపైగా పరుగులు చేశాడు.నితీశ్ కు చాన్స్ పక్కా! హార్దిక్ పాండ్యా, హర్షిత్ రాణా గాయాలతో జట్టుకు దూరమయ్యారు. అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ ఆసియా క్రీడల కోసం వెళ్లారు. దీంతో నితీశ్ కుమార్ రెడ్డికి తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్ స్పిన్ బాధ్యతలు చేపట్టనున్నారు.న్యూజిలాండ్, శ్రీలంకతో సిరీస్‌లు కోల్పోయిన వెస్టిండీస్ ఈ సిరీస్‌లో సత్తా చాటాలని చూస్తోంది. వచ్చే ఏడాది ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌కు ముందు ఈ సిరీస్ ఆ జట్టుకు కీలకం. 19 ఏళ్ల స్పిన్నర్ విటెల్ లాస్‌పైనా ఆసక్తి నెలకొంది. ఐదు వన్డేల్లో అతడు ఎనిమిది వికెట్లు పడగొట్టాడు.మ్యాచ్ ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతుంది. స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం ఉంటుంది. జియోహాట్‌స్టార్‌లో లైవ్ స్ట్రీమింగ్ చూడొచ్చు.

## అక్టోబర్ 2న ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి

# పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలి

### - సభా వేదిక, హెలిప్యాడ్ ప్రాంతాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ, సీఎం పర్యటన సమన్వయకర్త, స్థానిక ఎమ్మెల్యే



**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం:** రాయలసీమ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌లకు శంకుస్థాపన కార్యక్రమాల కోసం అక్టోబర్ 2న అన్నమయ్య జిల్లా మదనపల్లెకు రానున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, సీఎం పర్యటన సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్, స్థానిక శాసనసభ్యులు షాజహాన్ భాష అధికారులకు సూచించారు.

ఈ మేరకు శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మదనపల్లె చుట్టుపక్కల చంద్ర కాలనీ, బికేపల్లి, జిఎంఆర్ పాలిటెక్నిక్ కాలేజ్, వెన్నెల రెస్టారెంట్ వెనుక ప్రాంతం, పుంగనూరు రోడ్డు చౌడేశ్వరి గుడి ప్రాంతం, అంగళ్లు నుంచి సిటిఎం, మదనపల్లి ప్రాంతం మరియు కలికిరి రోడ్డు మేకవారిపల్లి తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి స్థల పరిశీలనలతో పాటు సభా వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రదేశాలు తదితరాలలో చేయవలసిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సభా ప్రాంగణంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులకు అవసరమైన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. పార్కింగ్, బారికేడ్లు, వేదిక, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి పర్యటనలో పాల్గొనే ప్రజాప్రతినిధుల లైన్‌అప్‌కు అనుగుణంగా అవసరమైన బారికేడ్లు, ఇతర సదుపాయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ఇంజనీరింగ్ అధికారులు పరస్పర సమన్వయంతో పనులను వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచించారు. ముందస్తు ప్రణాళికతో పనిచేస్తూ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చూడాలని, కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని సూచించారు. పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, ప్రజల రాకపోకలు, వేదిక నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, మదనపల్లె సబ్ కలెక్టర్ చల్ల కళ్యాణి, పీలేరు ఆర్డీవో, మదనపల్లె తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, ఏపీఎస్‌పీడీసీఎల్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, పోలీస్, ఫైర్ తదితర శాఖల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## పరిశుభ్రత, ఆరోగ్యం, మంచి అలవాట్లపై

# విద్యార్థులకు అవగాహన





**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం :** అన్నమయ్య జిల్లా రాయచోటిలోని ౨౦ఎ విద్యా మందిర్ హై స్కూల్లో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, క్రమశిక్షణపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డా. ఎం. సుధాకర్ రెడ్డి, మాట్లాడుతూ, "పరిశుభ్రమైన పరిసరాలు మంచి ఆలోచనలకు, మంచి అలవాట్లు మంచి భవిష్యత్తుకు పునాది వేస్తాయి" అని అన్నారు. విద్యార్థులు పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తను చెత్తబుట్టల్లో వేయాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, మొక్కలను సంరక్షించాలని, నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, తగినంత నీరు తాగడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, క్రీడల్లో పాల్గొనడం, సమయపాలన పాటించడం వంటి మంచి అలవాట్లను అలవర్చుకోవాలని తెలిపారు. అలాగే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించడం, మర్యాదగా మాట్లాడటం, ఇతరులతో సహకారభావంతో మెలగడం, మొబైల్ ఫోన్‌ను బాధ్యతాయుతంగా వినియోగించడం వంటి విలువలను పాటించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో పరిశుభ్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, క్రమశిక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. "మార్పును మీతోనే ప్రారంభించండి" అని డా. ఎం. సుధాకర్ రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు.

## రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో

# మోటార్ సైకిళ్ల దొంగతనం కేసుల ఛేదన

### - 12 మోటార్ సైకిళ్లు రికవరీ



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం :** రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన ౧౨ూ ౩ూ మోటార్ సైకిళ్ల దొంగతనం కేసులకు సంబంధించి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడిన మైనర్ బాలురను గుర్తించి, చట్టపరమైన చర్యలు చేపట్టడం జరిగింది. వారి వద్ద నుండి వివిధ ప్రాంతాల్లో దొంగిలించబడిన మొత్తం 12 మోటార్ సైకిళ్లను పోలీసులు రికవరీ చేశారు. రికవరీ చేసిన వాహనాలకు సంబంధించి వాటి యజమానులను గుర్తించి, చట్టపరమైన ప్రక్రియ అనంతరం వాహనాలను అప్పగించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుంది. మైనర్ బాలురు దొంగతనాలకు పాల్పడిన నేపథ్యంలో, వారి విషయంలో జువెనైల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) చట్టం మరియు సంబంధిత చట్టాల ప్రకారం తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుంది. ఈ కేసులను ఛేదించడంలో కృషి చేసిన పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

**ప్రజలకు విజ్ఞప్తి:**

ప్రజలు తమ వాహనాలను సురక్షిత ప్రదేశాల్లో పార్క్ చేసి, తప్పనిసరిగా హ్యాండిల్ లాక్/ఇతర భద్రతా పరికరాలను ఉపయోగించాలి. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల కదలికలు గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీసులకు సమాచారం అందించాలి అన్నారు.

## రామ్ తాళ్ళూరికి జన్మదిన శుభాకాంక్షలు !

### - జనసేన పార్టీ కార్యకర్తల సమస్యలను అర్థం చేసుకునే నాయకుడు
### - జనసేన పార్టీ రాయచోటి నియోజకవర్గం నాయకుడు ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్



**రాయచోటి-సూర్య వాస్తవం:** రెండు తెలుగు రాష్ట్రాలలో జనసేన పార్టీ నాయకుల సమస్యలను అర్థం చేసుకుని వెంటనే పరిష్కరించే నాయకుడు, ప్రముఖ సినీ నిర్మాత నిర్మాత, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి అని జనసేన పార్టీ రాయచోటి నియోజకవర్గం నాయకుడు ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్ అన్నారు. ఆదివారం రామ్ తాళ్లూరి పుట్టినరోజున తమ కార్యాలయంలో కేక్ కట్ చేసి జనసేన పార్టీ శ్రేణులతో కలిసి ఆయన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్త అర్ధరాత్రి ఫోన్ చేసినా స్పందించే హృదయం గల నాయకుడు జనసేన పార్టీ లో రాష్ట్ర ముఖ్య కార్యదర్శిగా ఉండడం కార్యకర్తల అదృష్టం అని చెప్పారు. జనసేన పార్టీ వ్యవస్థాపకుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వెను వెంటే ఉండి, పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేస్తున్న రామ్ తాళ్లూరి ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఇలాగే100 పుట్టినరోజులుజరుపుకోవాలని మనసారా ఆయన ఆకాంక్షించారు. ఈ పుట్టినరోజు వేడుకల్లో జనసేన పార్టీ శ్రేణులు దర్బార్ బాషా, యహియా భాష, న్యాయవాది జఫ్రుల్లా, ఆడిటర్ అష్రఫ్, ఇలియాస్, జిలాని భాష తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంగన్వాడీ ఉత్సవాలు



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండల కేంద్రంలోని ఏ కె రోడ్డులో ని అంగన్వాడీ కేంద్రంలో శనివారం సూపర్వైజర్ లక్ష్మమ్మ ఆధ్వర్యంలో అంగన్వాడీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 27 తేదీనుండి అక్టోబర్ 10 వరకు నిర్వహించే ఉత్సవాలలో భాగంగా ఈ ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోషక వేడుకలు,అన్నప్రాసన,గర్భవతులకు పౌష్టిక హాహారం ,హాహ్వానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు,గర్భవతులు, బాలింతలు,పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శిగా జోగయ్య



**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శిగా బ్రహ్మంగారిమఠానికి చెందిన జోగయ్య నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జోగయ్య మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, మాజీ శాసనసభ్యులు శెట్టిపల్లి రఘురామిరెడ్డికి, జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డికి, పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డికి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముత్యాల రామ గోవింద్ రెడ్డికి,నియోజకవర్గ, మండల స్థాయి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : M. SULEMAN SAHEB H. No 158/56 UMA NAGAR, ANANTHAPURAM ANDHRA PRADESH - 515001. CELL : : 9885404140

# ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

**ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం**
**సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు**
**ప్రతి వినతిని పరిశీలించి న్యాయం చేస్తామని హామీ**



**అనంతపురం సిటీ – సూర్య వాస్తవం :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి పరిష్కారం చూపించడమే లక్ష్యంగా ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి మంత్రి స్వయంగా వినతిపత్రాలు స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను మంత్రికి వివరించగా, సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని పరిశీలించి, అర్హత మేరకు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి పయ్యావుల కేశవ్ హామీ ఇచ్చారు. అధికార యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

## 300 మంది విద్యార్థులకు బాలల బీమా చెక్కుల పంపిణీ



**బెళుగుప్ప– సూర్య వాస్తవం :** మండలంలోని వెంకటాద్రిపల్లి గ్రామ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు బాలల బీమా పథకం కింద చెక్కులను టీడీపీ నాయకులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం లక్ష్మీ శిరీషకు బీమా చెక్కును నాయకులు అందించారు. టీడీపీ నాయకులు తమ్మనేని రాధాకృష్ణ, భాస్కర్, కిషోర్, రాధాకృష్ణల చేతుల మీదుగా శిర్పి గ్రామ ప్రాథమిక పాఠశాల, వెంకటాద్రిపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులకు బాలల బీమా చెక్కులు అందజేశారు. విద్యార్థుల భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బాలల బీమా పథకం అమలు చేయడం అభినందనీయమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా కళా ప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మి నర సింహం 159వ జయంతి




**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలోని ఫుట్బాల్ గ్రౌండ్లో శనివారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల భవ నంలో కోశాధికారి జెన్నేకు ల్లాయిబాబు ఆధ్వర్యంలో చిలక మర్తి లక్ష్మీ నరసింహం 159వ జయంతి ఘనంగా నిర్వహించారు. కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు,సెక్రెట రీ రామ్ మోహన్ చిలక మ ర్తి లక్ష్మి నరసింహం చిత్ర ప టానికి పూల మాల వేసి ని వాళులర్పించారు. కోశాధి కారి జెన్నే కుల్లాయిబాబు మాట్లాడుతూ ఈయన తూ ర్పుగోదావరి జిల్లాకు చెంది న కవి,నాటక కర్త,సంఘ సంస్కర్త, విద్యావేత్త. 19 09లో సామాజికంగా వె నుకబడిన వారి విద్యాభి వృద్ధి కోసం ప్రత్యేకించి ఒక పాఠశాలను స్థాపించారు. వీ రు స్కూల్ స్థాపించి పుస్తకా లు నుండి వచ్చిన రాబడి తోనే పాఠశాలను నడిపారు. దేశ మాత అనే వార పత్రిక ద్వారా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా వ్యాసాలు రాశారు. వీరికి మహాకవి, కళా ప్రపూర్ణ మొదలైనవి బిరుదులు ఇచ్చారు అని కోశాధికారి జెన్నే కుల్లా యిబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు,సెక్రె టరీ రామ్ మోహన్,వైస్ ప్రెసిడెంట్ షైక్షావలి,నారా యణరెడ్డి,వెంకటేష్,నారా యణ శెట్టి,అస్సన్ అహ మ్మద్,మద్దులేటి,నరసిం హులు,ఓబులేసు తదిత రులు పాల్గొన్నారు.

## రేపు బ్యాంకులు పనిచేస్తాయి!




**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు, సూచనల మేరకు ఆదివారం అన్ని బ్యాంకులు పనిచేస్తాయని బ్యాంక్ అధికారులు చెప్పారు. ఈ మేరకు గుత్తి పట్టణం లోని స్టేట్ బ్యాంక్ మె యిన్ బ్రాంచ్ మేనేజర్ వీరయ్య,గు త్తి ఆర్ఎస్ స్టేట్ బ్యాంక్ మేనేజర్ మునీర్, తొండపాడు కెనరా బ్యాంక్ మేనేజర్ రవికుమార్ ఓ ప్రకటనలో చెప్పారు. యధావిధిగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బ్యాంకులు పనిచేస్తాయ న్నారు. స్ట్రైక్ నేపథ్యంలో ఈ నిర్ణ యం తీసుకున్నారు.

# మీ చెత్త - మీకే సంపద.....

## - స్వచ్ఛతకు ప్రోత్సాహం.. చెత్తకు బదులు సరుకులు

**కనేకల్ – సూర్య వాస్తవం:** గ్రామాల్లో స్వచ్ఛతను పెంపొందించడంతో పాటు ప్రజలను పారిశుధ్య కార్యక్రమాల్లో భాగస్వాములను చేసేందుకు కనేకల్ మండలంలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి విజయసింహారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో పి.చంద్రమౌళి వివరాలను వెల్లడించారు. మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీకి ప్రతిరోజూ 'స్వచ్ఛ రథం' వెళ్లేలా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. గ్రామ ప్రజలు తమ ఇళ్లలో సేకరించిన పొడి చెత్తను స్వచ్ఛ రథానికి అందజేస్తే, దానికి సమానమైన విలువగల నిత్యావసర సరుకులను తీసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

**దసరా సందర్భంగా ప్రత్యేక ఆఫర్**

దసరా పండుగను పురస్కరించుకుని సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 22 వరకు ప్రత్యేక ఆఫర్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమయంలో ప్రతి కిలో పొడి చెత్తకు అదనంగా రూ.5 విలువను కలిపి, అందుకు సమానమైన విలువగల నిత్యావసర సరుకులను అందించనున్నట్లు వివరించారు.

**25 కిలోలు దాటితే లక్కీ డిప్**

ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో 25 కిలోలకు పైగా పొడి చెత్తను అందజేసిన వారిని ప్రత్యేకంగా గుర్తించనున్నట్లు అధికారులు తెలిపారు. అర్హులైన వారి పేర్లతో లక్కీ డిప్ నిర్వహించి, ప్రతి పంచాయతీ నుంచి ముగ్గురు విజేతలను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. విజేతలకు గ్రామ పంచాయతీ తరఫున ఆకర్షణీయమైన బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్లలోని పొడి చెత్తను స్వచ్ఛ రథానికి అందజేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ కనేకల్ మండలంలోని గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని ఎంపీడీవో విజయసింహారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో పి.చంద్రమౌళి కోరారు.

| వరుస సంఖ్య | వస్తువు పేరు | మొత్తము (ఒక కిలో) | పెంచిన మొత్తము (ఒక కిలో) |
|---|---|---|---|
| 1 | ఇనుము | 20 | 25 |
| 2 | పేపర్లు | 15 | 20 |
| 3 | పుస్తకములు | 10 | 15 |
| 4 | అట్టపెట్టెలు | 10 | 15 |
| 5 | ప్లాస్టిక్ బాటిల్స్ | 20 | 25 |
| 6 | గాజు బాటిల్స్ | 2 | 7 |
| 7 | స్టీల్ వస్తువులు | 40 | 45 |
| 8 | అల్యూమినియం | 120 | 125 |
| | ఇతరములు | | |

# 27న "చలో విజయవాడ"కు అనుమతి లేదు

**- జిల్లా ఎస్పీ పి. జగదీష్**
**- అనుమతి లేని ర్యాలీలు, ధర్నాలకు దూరంగా ఉండాలి**
**- నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు**



**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయ ఉద్యోగులు వివిధ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 27న నిర్వహించ తలపెట్టిన "చలో విజయవాడ" ధర్నా కార్యక్రమానికి అనుమతి లేదని జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఐపీఎస్ తెలిపారు. అనుమతి లేని ర్యాలీలు, ధర్నాల్లో పాల్గొని ఇబ్బందులు తెచ్చుకోవద్దని ఆయన సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వులు, అధికారుల ఆదేశాలను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించి అనుమతి లేని కార్యక్రమాల్లో పాల్గొంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ కోరారు.

# 27న గుత్తి కోటలో ప్రపంచ పర్యాటక దినోత్సవం




**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి పట్టణం గుత్తి కోటలో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా 2026 సెప్టెంబర్ 27న గుత్తి కోటలో గుత్తి కోట సంరక్షణ సమితి ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని మున్సిప ల్ కమిషనర్ సురేంద్ర తెలిపారు. శని వారం ఆయన మాట్లాడుతూ.. వేడు కల్లో భాగంగా ర్యాలీ, హెరిటేజ్ వాక్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహి స్తున్నట్లు చెప్పారు. ప్రజలందరూ పా ల్గొని ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## పోషణతోనే చిన్నారుల సంపూర్ణ వికాసం

**అంగన్వాడీ ఉత్సవంలో తల్లి--శిశు సంక్షేమంపై అవగాహన**





**పెళ్లకూరు– సూర్య వాస్తవం:** పోషణ్ మాహ్‌లో భాగంగా పెళ్లకూరు మండలం పాలచూరు ఎస్సీ అంగన్వాడీ కేంద్రంలో శనివారం అంగన్వాడీ ఉత్సవాన్ని నిర్వహించారు. అదే విధంగా షెడ్యూల్ ప్రకారం నిర్వహించాల్సిన అంగన్వాడీ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశాన్ని కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందుతున్న పూర్వ ప్రాథమిక విద్య, పోషకాహారం, ఆరోగ్య సేవలు, ఎదుగుదల పర్యవేక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రాల సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు కమిటీ సభ్యులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమానికి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు యద్దల నరేంద్ర రెడ్డి హాజరై అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సహాయకులు అందిస్తున్న సేవలను అభినందించారు. సేవలకు గుర్తింపుగా వారిని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ నాయుడుపేట ప్రాజెక్టు సీడీపీవో కె. ఉమామహేశ్వరి, సూపర్‌వైజర్ శ్రీ లక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. చిన్నారుల పోషణ, ఆరోగ్యం, పూర్వ ప్రాథమిక విద్యతో పాటు తల్లి--శిశు సంక్షేమ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే అంగన్వాడీ ఉత్సవం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు.

## పుట్టపర్తిలో మెగా వైద్య శిబిరం ప్రారంభించిన "మంత్రి సత్య కుమార్ యాదవ్"





**దొరవారిసత్రం – సూర్య వాస్తవం:** పుట్టపర్తిలో పాత్రికేయులు,వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణ కోసం నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య,కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు,ధర్మవరం ఎమ్మెల్యే శ్రీ సత్య కుమార్ పాల్గొని వైద్య సేవలను పరిశీలించారు. క్యాన్సర్, గుండె,నరాల, జీర్ణకోశం, ఎముకలు--కీళ్లు,సాధారణ శస్త్రచికిత్స తదితర విభాగాల్లో ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించి, నిపుణులైన వైద్యులను అడిగి సేవల వివరాలను తెలుసుకున్నారు. రక్తపోటు,మధుమేహం,రక్త, ప్రయోగశాల పరీక్షలతో పాటు వివిధ వ్యాధులను ముందుగానే గుర్తించే స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తదుపరి చికిత్సపై వైద్యులు సూచనలు,మార్గదర్శకాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.పాత్రికేయులు నిరంతరం ప్రజల మధ్య ఉంటూ విధులు నిర్వహిస్తున్నందున పని ఒత్తిడిలో తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు.వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే ముందుగానే ఆరోగ్య సమస్యలను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యమని మంత్రి తెలిపారు.పాత్రికేయులు,వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి ప్రత్యేక వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు.

## పేషంట్ అటెండన్ట్ విశ్రాంతి గదులను ప్రారంభించిన మంత్రి సత్య కుమార్ యాదవ్






**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:** అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రోగుల సహాయకుల కోసం నిర్మించిన పేషెంట్ అటెండన్ట్ రెస్ట్ రూమ్స్ ను మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్శనివారం ప్రారంభించారు,అనంతపురం జిల్లాతో పాటు కర్ణాటక సరిహద్దు ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో రోగులు ఈ ఆసుపత్రికి వస్తున్న నేపథ్యంలో,వారి సహాయకులకు సౌకర్యవంతమైన వసతి కల్పించేందుకు 2 ఆధునిక భవనాలను నిర్మించి, కుర్చీలు,టాయిలెట్లు,టీవీలు తదితర సదుపాయాలను ఏర్పాటు చేశారు. 560 శాంక్షన్డ్ బెడ్స్ ఉన్న ఈ ఆసుపత్రిలో ప్రస్తుతం 1,000కు పైగా ఫంక్షనల్ బెడ్స్‌సేవలు అందుతుండగా,రోజుకు 3,000కు పైగా ఓపీ లు,సుమారు 1,500 వరకు ఐపీ కేసులు నమోదవుతున్నాయి. ఇంతటి అధిక రోగుల రద్దీకి అనుగుణంగా మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడంతో పాటు,వైద్య సిబ్బంది, క్యాన్సర్ చికిత్స,అత్యవసర వైద్యం,ప్రజారోగ్య సేవలను మెరుగుపరుస్తూ అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిని మరింత సమర్థవంతమైన వైద్య కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగిస్తున్నాము. అని ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు.

## నాయకులు, అభిమానుల మధ్య ఘనంగా వేనాటి ముని రెడ్డి జన్మదిన వేడుకలు



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం:** సూళ్లూరుపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి పునాదులు వేసి ఆ పార్టీలోఎన్నో పదవులు చేపట్టి స్వర్గస్తులైన మాజీ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ వేనాటి ముని రెడ్డి ద్వితీయ కుమారుడైన యువ నాయకుడు, తిరుపతి పార్లమెంటు తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి జన్మదిన వేడుక సూళ్లూరుపేట వారి కార్యాలయంలో జన్మదిన వేడుక ఘనంగా జరిగింది. తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు,స్నేహితులు మధ్య వైభవోపేతంగా జరిగింది. వారి అభిమానాన్ని గజమాల వేసి, శాలువాతో సన్మా నించి శుభాకాంక్షలు తెలిపారు.కేక్ కోసి సంతోషంలో పాలుపంచుకున్నారు. సతీష్ రెడ్డి తెలుగుదేశం పార్టీ కుటుంబంలో మంచి గుర్తింపు పొందే,ప్రజాసేవ చేసే ఉన్నత పదవులు అలంకరించాలని,తండ్రి బాటలో ప్రజా సేవ చేయాలని కూడా నాయకులు, అభిమానులు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.